RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 4 ఆగస్ట్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:57

## నిమ్స్‌లో వెయ్యి మంది పేషెంట్లకు రొబోటిక్ సర్జరీలు

### డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



వార్తా 2 లో

## నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు



నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

## బకింపురలో పీకే ప్రభంజనం.. బీజేపీ కోటను బద్దలు కొట్టిన ప్రశాంత్ కిషోర్



పట్నా, ఆగస్టు 3 : బీహార్‌లోని బకింపుర ఉపఎన్నికలో జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయాన్ని నమోదు చేశారు. ఎన్నో ఏళ్లుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఈ ఉపఎన్నికలో అధికార ఎన్డీఏకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రచారం ప్రారంభం నుంచే ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకున్న ప్రశాంత్ కిషోర్, గ్రామీణ ఓటర్లు, యువత, మహిళల మద్దతును గెలుచుకుని విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ఫలితంతో బీహార్ రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చ మొదలైంది. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు జనసురాజ్ పార్టీకి ఇది భారీ ఊపునిచ్చే విజయంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు, బీజేపీ తన బలమైన నియోజకవర్గాన్ని కోల్పోవడం పార్టీకి ఆత్మపరిశీలన అవసరాన్ని తెచ్చిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ విజయం బీహార్ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందా? అనే చర్చ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సాగుతోంది

## కంట తడి పెట్టిన మాతంగి స్వర్ణలత



నా విగ్రహ ప్రతిష్ట ఎందుకు చేయడం లేదు.. ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ట జరగాలి

నాకు అడ్డొచ్చిన వారిని పాదాల కింద నలిపేస్తా

ఈ ఏడాది భారీగా ప్రాణ నష్టం జరుగుతుంది.

వావి వరసలు లేకుండా ప్రజలు వ్యవహరిస్తున్నారు

మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలి

ఏ ఆపద వచ్చినా ప్రమాదం నుంచి కాపాడుతున్నాప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలి

ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు : భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత

ఘనంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు – పచ్చికుండపై నిల్చొని రంగం భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత – ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని వెల్లడి

ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని మాతంగి స్వర్ణలత తెలిపారు. సికింద్రాబాద్? ఉజ్జయిని మహంకాళి బోనాల (లష్కర్?) ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. కుంభవర్షాలతో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉందని ప్రాణనష్టం, అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. వావివరసలు లేకుండా జనాలు ప్రవర్తిస్తారని భవిష్యవాణిలో మాతంగి స్వర్ణలత తెలిపారు.

## వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి...

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**వైద్య కళాశాల పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలి**

**హాస్టళ్లు సెప్టెంబర్‌లో, అడ్మిన్ బ్లాక్ అక్టోబర్‌లో, అన్ని పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి**

**వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అందుబాటులో ఉండాలి**



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజాబలం:** ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.

సోమవారం రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (షెడ్యూల్) సిద్ధం చేయాలని సూచించారు. వైద్య కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్, అంతర్గత రహదారులు పూర్తి చేయాలని, అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు నిరంతరం ఫాలోఅప్ చేసి త్వరితగతిన ఆమోదాలు పొందాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2 లో

## అమెరికాలో తెలంగాణకు పెట్టుబడుల పిలుపు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



బాల్టిమోర్ (అమెరికా): అమెరికన్ తెలుగు అసోసియేషన్ 19వ జాతీయ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రవాస భారతీయులకు మాతృభూమికి రుణం తీర్చుకునే సమయం వచ్చిందని పిలుపునిచ్చారు .ముఖ్యాంశాలు:తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాలకు పోటీగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేసి, ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రవాస భారతీయులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్ 36 రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వివరించారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు. ఎన్ఆర్ఐల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థఎన్ఆర్ఐలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధ అధికారాలతో కూడిన ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు. తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ) కార్యక్రమాన్ని వినియోగించుకుని, ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రవాసులకు విజ్ఞప్తి చేశారు.

## కావేరి వివాదం: కర్ణాటక ప్రయోజనాలే ముఖ్యమన్న డీకే శివకుమార్



కావేరి జలాల పంపిణీ వివాదంపై ఎలాంటి బంద్‌లకు పిలుపునివ్వొద్దని రాజకీయ పార్టీలు, కన్నడ సంఘాలకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం కావేరి జలాల యాజమాన్య ప్రాధికార సంస్థ (సీడబ్ల్యూఎంఏ), కావేరి జలాల నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ) ఆదేశాలపై చర్చించేందుకు నిర్వహించిన అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

తమిళనాడుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని సీడబ్ల్యూఎంఏ, సీడబ్ల్యూఆర్‌సీ ఆదేశించినప్పటికీ, చట్టపరిధిలోనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని శివకుమార్ తెలిపారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతంలో కేవలం 35 శాతం మాత్రమే నమోదైందని, రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటోందని వివరించారు. ప్రస్తుతానికి తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, సాగునీటికి కాకుండా కేవలం తాగునీటి చెరువులను నింపేందుకే కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. గత ఏడాది జులైలో సుమారు 31 టీఎంసీల నీటిని విడుదల చేయగా, ఈసారి జలాశయాల్లోకి నీటి ప్రవాహం లేకపోవడంతో కేవలం 3.6 టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేశామని సీఎం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితి కొద్దిగా మెరుగుపడిందన్నారు. కావేరి అంశంపై ప్రభుత్వ వైఖరికి అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని, ఈ ఐక్యతను కొనసాగించాలని కోరారు.

ఈ సమస్యపై ప్రధాని నరేంద్ర మోదీని కలిసేందుకు అఖిలపక్ష బృందంతో అపాయింట్‌మెంట్ కోరామని, ప్రధాని సానుకూలంగా స్పందించారని శివకుమార్ వెల్లడించారు. కావేరి వివాదానికి మేకెదాటు ప్రాజెక్టే శాశ్వత పరిష్కారమని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రజాబలం

4 ఆగస్ట్ 2026 మంగళవారం

## 2 లక్షల కోట్ల దాటేస్తున్న జీఎస్టీ

దేశంలో వస్తు సేవల పన్ను సూళ్లు ఇటీవల రూ. 2 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. సాధారణంగా జీఎస్టీ రేట్ల ల్యాండ్‌స్కేప్‌లో సంస్కరణలు , రేట్ల సర్దుబాట్లు చేసిన తర్వాత స్వల్పకాలంలో పన్ను ఆదాయం తగ్గుతుందనే అంచనాలు ఉండేవి. అయితే, అనుకున్నదానికి భిన్నంగా రాబడి ప్రతి నెలా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం దీనిని పన్ను వ్యవస్థలో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనంగా చూపుతున్నప్పటికీ.. నాణేనికి మరోవైపు ఉన్న పన్ను రాబడి స్వభావాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ఆర్థిక సూత్రాల ప్రకారం, జీఎస్టీ అనేది అడ్ వలోరమ్ పన్ను. అంటే, ఇది ఒక వస్తువు లేదా సేవ తుది విక్రయ ధరపై శాతంగా లెక్కిస్తారు. అంటే ఓ వస్తువు ధర వంద రుపాయలు అయితే దానిపై ట్యాక్స్ 18 శాతం అయితే .. పద్దెనిమిది రూపాయల ట్యాక్స్ కట్టాలి. మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగినప్పుడు పన్ను శాతం మారకపోయినప్పటికీ, ప్రభుత్వానికి వచే పన్ను మొత్తం ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. ఉదాహరణకు, రూ. 100 విలువైన వస్తువుపై 18% జీఎస్టీ పడితే ప్రభుత్వానికి రూ. 18 వస్తుంది. కానీ ద్రవ్యోల్బణం వల్ల అదే వస్తువు ధర రూ. 150కి పెరిగితే, అదే 18% చొప్పున ప్రభుత్వానికి రూ. 27 పన్ను సమకూరుతుంది. అంటే వ్యాపారం లేదా వస్తువుల వినియోగ పరిమాణం పెరగకపోయినా, కేవలం ధరల పెరుగుదల వల్ల కూడా పన్ను వసూళ్లు గణనీయంగా పెరుగుతాయి.ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సంరక్షణాత్మక వాణిజ్య విధానాలు, సుంకాల యుద్ధాలు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం భారతీయ మార్కెట్‌పై కూడా పడి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, ముడిసరుకుల ధరలు పెరగడానికి దారితీసింది. ఆసియా, ఐరోపా మార్కెట్లలో రేగన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వ్యాపార వ్యయాన్ని పెంచడంతో.. ఆ భారం అంతిమంగా వినియోగదారుడిపై పడింది. ధరలు పెరగడం వల్ల ప్రజల జేబుల నుంచి ఎక్కువ సొమ్ము పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది.కేవలం రూ. 2 లక్షల కోట్ల జీఎస్టీ రికార్డు కలెక్షన్లను మాత్రమే చూసి దేశంలో ప్రగతి ఉప్పొంగిపోతోందని తీర్మానించడం సమగ్రమైన విశ్లేషణ కాదు. ఈ రాబడిలో ఎంత భాగం నిజమైన ఆర్థిక వృద్ధి ద్వారా వచ్చింది, ఎంత భాగం ద్రవ్యోల్బణం వల్ల పెరిగిందో వేరు చేసి చూడాలి. ఒకవైపు ధరల భారంతో సామాన్య ప్రజల కొనుగోలు శక్తిపై ప్రభావం పడుతుంటే, మరోవైపు అదే ధరల పెరుగుదల ప్రభుత్వానికి రికార్డు రాబడిని తెచ్చిపెడుతోంది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్సడ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించిందిపన్ను సంస్కరణలతో పాటు పన్ను నిఘా పెరగడం సానుకూలాంశమే అయినప్పటికీ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల వల్ల పెరుగుతున్న పన్ను భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించే చర్యలపై దృష్టి సారించడమే నిజమైన ఆర్థిక నిర్వహణ అవుతుంది

## శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రంగం కార్యక్రమం అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



సికింద్రాబాద్ సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి అమ్మవారి రంగం కార్యక్రమంలో భవిష్యవాణి తెలిపారు.తెలంగాణ లో మంచి వర్షాలు పడతాయని అమ్మవారు చెప్పారు.రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలని తెలంగాణ సాంప్రదాయ ఆచారలతో ఆషాఢ మాస బోనాలకు ప్రభుత్వం తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగింది.దేవాదాయ శాఖ, రెవెన్యూ అన్ని విభాగాల శాఖలు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందిప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలు ఉచిత బస్సు ప్రయాణం..మంచి సౌకర్యాలతో మూడింతలు భక్తులు వచ్చారు కొంత భక్తులకు ఇబ్బంది కలిగింది.హైదరాబాద్ ప్రజలకు ధన్యవాదాలు.. బోనాల సందర్భంగా లక్షలాది మంది వచ్చిన ట్రాఫిక్ తదితర ఇబ్బందులు కలిగిన సహకరించారురెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖ, అన్ని విభాగాల సమన్వయం తో బోనాలు సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందిదేవాలయాలకు వెళ్లినపుడు దర్శనాలకు గుర్తింపు కార్డు ఇవ్వాలని జోగిని లు కోరారు.జోగిని లకు మున్సిపల్ కోపరేషన్ లో సభ్యులు గా ఇవ్వాలని వారికి కేబినెట్ నిర్ణయించింది వారికి ఉద్యోగాలు ఇస్తున్నాందేవాదాయ శాఖ కమిటీ కి సంబంధించి వారికి గుర్తింపు ఇచ్చే విషయంలో ప్రభుత్వం పరిశీలిస్తుంది.అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇక్కడే ఉన్నారు అధికారులతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి నివేదిక మీద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

## నిమ్స్‌లో వెయ్యి మంది పేషెంట్లకు రొబోటిక్ సర్జరీలు

### డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నిమ్స్ హాస్పిటల్ మరో ఘనతను సాధించింది. రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే నిమ్స్ హాస్పిటల్‌లో 1,000 రొబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని కలిసిన డాక్టర్ రాహుల్ దేవరాజ్, నిమ్స్ సాధించిన ఈ ఘనతను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్‌తో పాటు రొబోటిక్ సర్జరీల్లో భాగస్వాములైన డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఇటీవలే నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తవడం, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని మంత్రి అన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోనే ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో కూడా రొబోటిక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ హాస్పిటళ్లతో పాటు గాంధీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్‌లోనూ అత్యాధునిక రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేసి, ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు.

డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన వెయ్యి రొబోటిక్ సర్జరీల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) వంటి ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషమని తెలిపారు. దీంతో ఖరీదైన రొబోటిక్ సర్జరీలను కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు.

ఈ విజయానికి యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషి కారణమని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల బలోపేతానికి నిరంతరం సహకరిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ దేవరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించే దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి...






మొదటి పేజీ తరువాయి

బాలికల హాస్టల్ నిర్మాణాన్ని సెప్టెంబర్ 1 నాటికి పూర్తి చేయాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహతో టెలిఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల పూర్తి కోసం అదనంగా రూ.64 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, ప్రధానంగా విద్యుత్, మౌళిక సదుపాయాల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, నిధులు మంజూరైతే పూర్తి చేసి కళాశాలను ప్రారంభించే అవకాశం ఉంటుందని వివరించారు.

ముందుగా గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని, సెప్టెంబర్‌లో హాస్టళ్ల నిర్మాణం, అక్టోబర్‌లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ పనులు పూర్తి చేసి, డిసెంబర్ చివరి నాటికి అన్ని నిర్మాణాలను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.

ఖమ్మంలో ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో అప్పటిలోగా అన్ని పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా కలెక్టర్, తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య కళాశాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు.

అనంతరం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి, మొత్తం 17 బ్లాకులు, పేరెంట్స్ లాంజ్, కిచెన్, డైనింగ్ హాల్‌తో పాటు అన్ని నిర్మాణాలను నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌళిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాస చారి, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, వైద్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను ఖచ్చితత్వం...

## ఓటర్ల డిజిటలైజేషన్‌లో నాణ్యత, పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను ఖచ్చితత్వం, నాణ్యతతో పూర్తి చేసి పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు,సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి





సమీక్షించారు,ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, బీఎల్‌వో యాప్‌లో ప్రతి ఓటరు వివరాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని సూచించారు.

ప్రతి ఓటరికి సంబంధించిన ఫొటోను తప్పనిసరిగా పరిశీలించి ఫొటో మిస్‌మ్యాచ్‌లు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఫొటో ధృవీకరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు,గైర్హాజరైన, వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు,బీఎల్‌వోలు,ఈఆర్‌వోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాలకు సంబంధించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు,ఓటర్లకు మరింత సౌకర్యం కల్పించే విధంగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)ను పకడ్బందీ ప్రణాళికతో చేపట్టాలని తెలిపారు. హేతుబద్ధీకరణలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు,వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా నాణ్యత, పారదర్శకతతో పూర్తి చేయాలని ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూనే ప్రతి నమోదు, ప్రతి ఫొటో, ప్రతి ధృవీకరణలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని,పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలనీ, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత,పాండు,ఈఆర్‌వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పరారీలో వైసీపీ నేతలు

ఏలూరు, గుంటూరు, ఆగస్టు 3, ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు.అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు. అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అనుభవిస్తున్నారు. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్ లేకుండా, పరివారానికి దూరంగా, నిరంతరం పోలీసుల సైరన్ వినపడితే ఉలిక్కిపడుతూ అజ్ఞాతంలో గడపడం ఏ రాజకీయ నాయకుడికైనా తీవ్రమైన మానసిక వేదన. ముందస్తు బెయిల్ ఇప్పించాలంటూ కోర్టుల చుట్టూ లాయర్లతో పిటిషన్లు వేయిస్తూ, రోజులు లెక్కిస్తూ బతకడం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు.వైసీపీ నాయకత్వం గానీ, ఈ పరారీలో ఉన్న నేతలు గానీ అర్థం చేసుకోవాల్సిన ప్రధానమైన అంశం ఒకటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు? ఎక్కడో ఒకచోట ఫోన్ వాడినా, డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా లేదా మూడో వ్యక్తితో మాట్లాడినా పోలీసులు సులభంగా ట్రాప్ చేయగలరు. పోలీసులకు పట్టుబడకుండా శాశ్వతంగా తప్పించుకోవడం అసాధ్యమనే విషయాన్ని గుర్తించకుండా, కోర్టులు ముందస్తు బెయిల్ ఇచ్చే వరకు అజ్ఞాతంలో ఉంటామనడం కేవలం స్వయంకృతాపరాధమే.నిజానికి చట్టాన్ని గౌరవించి ధైర్యంగా వెళ్లి పోలీసుల ముందు లొంగిపోతే .. మహా అయితే రిమాండ్‌కు పంపి జైలులో పెడతారు. కేసు తీవ్రతను బట్టి వారం లేదా పది రోజుల్లో సాధారణ బెయిల్ వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆ చట్టపరమైన మార్గాన్ని వదిలేసి, రోజూ అరెస్ట్ అవుతామేమోనన్న భయంతో ముళ్ల కంచె మీద గుడ్డ వేసుకున్నట్లు పరారీలో రోజులు గడపడం వ్యూహాత్మకంగా పెద్ద పొరపాటు. ఒకవైపు సుప్రీంకోర్టు కూడా తీవ్రమైన ఆరోపణలు, ఆర్థిక నేరాలు ఉన్న కేసుల్లో కస్టడీ విచారణ అవసరమని స్పష్టం చేస్తూ ముందస్తు బెయిళ్లను తిరస్కరిస్తోంది. ఈ పరిణామాలైనా వైసీపీ నేతలకు కళ్లు తెర్పించాలి. గతం చేసిన తప్పులకు భయపడి అడవుల్లోనో, పక్క రాష్ట్రాల్లోనో నక్కి నక్కి బతికే కన్నా.. చట్టం ముందు హాజరై, లొంగిపోయి న్యాయపోరాటం చేయడమే రాజకీయ నాయకులకు, వారి భవిష్యత్తుకు శ్రేయస్కరం. అది వారు అర్థం చేసుకోలేకపోతున్నారు



సంగారెడ్డి డి పి ఆర్ ఓ చేతుల మీదుగా ప్రజాబలం జిల్లా రిపోర్టర్ గా అక్రెడిటేషన్ కార్డు తీసుకోవటం జరిగింది

# రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి 1 కోటి బీమా చెక్కు.. అందజేసిన డీజీపీ సివి ఆనంద్




విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై అనంతరం మృతిచెందిన రాచకొండ కమిషనరేట్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వి. చరణ్‌కుమార్ (పీసీ–8968) కుటుంబ సభ్యులకు డీజీపీ సి.వి. ఆనంద్ రూ.1 కోటి బీమా చెక్కును అందజేశారు.

మల్కాజిగిరి కమిషనరేట్ 2018 బ్యాచ్‌కు చెందిన చరణ్‌కుమార్ ఈగల్ ఫోర్స్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. 2025 సెప్టెంబర్ 22–23 తేదీల అర్ధ రాత్రి విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా మహారాష్ట్రలోని దేవార్కర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన కుడికాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట స్థానికంగా ప్రథమ చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనల మేరకు ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించగా, చికిత్స అనంతరం 2025 అక్టోబర్ 28న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే అకస్మాత్తుగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు మళ్లీ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయన మృతిచెందినట్లు ప్రకటించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ షాండిల్య, ఎస్పీ రఘువీర్, అదనపు ఎస్పీ కృష్ణమూర్తి తదితర అధికారులు ఎస్‌బీఐతో సమన్వయం చేసి బీమా క్లెయిమ్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# రామాయంపేటలో స్కూల్ ఆటోను ఢీకొన్న లారీ

## సిద్దిపేట ఆసుపత్రిలో క్షతగాత్ర విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు

## విద్యార్థులకు అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించిన ఎమ్మెల్యే

## రూ.47.35 కోట్లతో హైవే అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం

## -- మీడియాతో ఎమ్మెల్యే వెల్లడి



**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** మెదక్, ఆగస్టు 3: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ఆద్య హోటల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూల్ ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ప్రమాదంలో రామాయంపేట మోడల్ స్కూల్‌లో చదువుతున్న లావణ్య (6వ తరగతి), ముఖేష్ (8వ తరగతి), స్థితిక (6వ తరగతి), దీక్షిత (ఇంటర్ మొదటి సంవత్సరం), సాయి వర్ధన్, శివచరణ్ గాయపడ్డారు. వీరు నిజాంపేట్ మండలంలోని నస్కల్ మరియు నగరం గ్రామాలకు చెందిన విద్యార్థులని సమాచారం.

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని, ప్రతి విద్యార్థికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, రామాయంపేట ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో శాశ్వత పరిష్కార చర్యలు అవసరమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామాయంపేట హైవే రోడ్డు అభివృద్ధి కోసం రూ.47.35 కోట్ల నిధులు తన ప్రత్యేక చొరవతో మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారి అధికారులతో మాట్లాడామని, అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తయితే ప్రమాదాలు తగ్గడంతో పాటు ప్రజలకు మరింత సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు భద్రత విషయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పాఠశాల వాహనాల విషయంలో ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

## కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.బి. రాజు.

సి. బెళగల్. మండల కేంద్రంలోని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట,భారత కమ్యూనిస్టు పార్టీ ,మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో,కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి.రాజు మాట్లాడుతూ.కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని,పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని,వర్షాలు పడితే తిరిగి విత్తనాలు వేయడానికి ఉచితంగా విత్తనాలు ఎరువులు ఇవ్వాలని,మూగజీవాలకు పశు గ్రాసం నీటి సౌకర్యాలు కల్పించాలని,గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని,రైతులకు తీసుకున్న అన్ని బ్యాంకులలో వ్యవసాయ రుణాలను రద్దుచేసి,కొత్త రుణాలు ఇవ్వాలని,పంటల భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి, రైతులు కట్టిన ప్రీమియాన్ని తిరిగి ఇవ్వాలని,కరువు కారణంగా రేషన్ కార్డు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి,చౌకధర దుకాణాల ద్వారా, 15 రకాల నిత్యవసర వస్తువులను,ఉచితంగా పంపిణీ చేయాలని, తొమ్మిది రకాల వినతులను, ప్రభుత్వానికి తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ అధికారి ఈరంరెడ్డి వెంకటలక్ష్మికి, సిపిఐ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సభ్యులు,రైతులందరూ కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఎమ్మార్వో వెంకటలక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ,మీ యొక్క వినితిని ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమంలో.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి రాజు, సిపిఐ కార్యకర్తలు, రైతు సంఘం సభ్యులు, సి.బెళగల్ మండల సిపిఐ కార్యవర్గ సభ్యులు పకీరప్ప, శేషు,మల్లి, చిన్న నాగన్న, రవి, చిన్న ఈరన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# నేటి...సమాజంలో జర్నలిస్టు...పాత్ర

**ప్రజలకు నిజాలను తెలియజేయాలి**

**సమస్యలను వెలికి తీయాలి**

**ఎలాంటి వారినైనా ప్రశ్నించగలగాలి**

**ఒత్తిళ్లకు లొంగక...బెదిరింపులకు**

**భయపడక... వృత్తి నిబద్ధత కలిగి ఉండాలి**

**ప్రత్యేక కథనం :**



ఒక వార్త ప్రభుత్వాన్ని కదిలించగలదు.ఒక కథనం సమాజాన్ని చైతన్యం తీసుకురాగలదు. ఒక జర్నలిస్టు అనుకుంటే అవినీతిని బట్టబయలు చేయగలడు. ఒక సంపాదకీయం సమాజాన్ని ఆలోచన చేయించగలదు. కలాన్ని ఆయుధంగా సత్యాన్ని సిద్ధాంతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు కొనసాగడమే నిజమైన జర్నలిజం. నేడు ప్రపంచం సాంకేతికాన్ని అరచేతిలోకి తీసుకొచ్చింది. సమాచారం క్షణాల్లో ప్రపంచానికి వ్యాపిస్తోంది. ఇలాంటి కాలంలో వార్తలు రాయడం కంటే నిజానిజాలను గుర్తించడం ధ్రువీకరించడం ప్రజలకు పాత్రికేయం పైన నమ్మకం కలిగించడం సవాలుగా మారింది.

సమాజంలో జర్నలిస్టు పాత్ర ఎంతో బాధ్యతాయుతమైనది. ఎంతో కీలకమైంది అని ప్రస్తుతం జర్నలిజంలోకి నూతనంగా వచ్చేవాళ్ళు తెలుసుకోవాలి...ముఖ్యంగా పాతవాళ్లు ఈ సంగతిని పూర్తిగా విస్మరించి ఏదో ఉన్నాంలే...ఏదో రాస్తున్నాం లే... మనకెందుకు తలనొప్పి అనుకుంటున్నారు..."కలం కత్తి కంటే గొప్పది" అనే నానుడికి నిజమైన అర్థం జర్నలిజం ద్వారా తెలుస్తుంది. ప్రజలకు నిజాలను తెలియజేయడం, అధికారులను ప్రశ్నించడం, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం జర్నలిస్టు ప్రధాన బాధ్యత.

**నాలుగో స్తంభం విలువ కాపాడాలి**

అందుకే జర్నలిస్టును ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పరిగణిస్తారు.

నేటి సమాజంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో...సమాచారం క్షణాల్లో ప్రపంచమంతా వ్యాపిస్తోంది.ఈ పరిస్థితుల్లో నిజమైన వార్తను ప్రజలకు వేగంగా, నిష్పాక్షికంగా అందించడం జర్నలిస్టుకు పెద్ద సవాలుగా మారిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.పెద్దలు చెప్పినట్లు 100 మంది దోషులకు శిక్ష పడ్డ పరవాలేదు.ఒక్క నిర్దోషికి అన్యాయం జరగ కూడదు అన్న మాటను గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడైనా ఎవరికైనా అన్యాయం జరుగుతుంది ,జరగబోతుంది ఇక నాకు న్యాయం చేసేది ఎవరు ? అని అనుకున్న తరుణంలో వారికి తప్పనిసరిగా జర్నలిస్టు అనేవాడు గుర్తుకు రావాలి. ప్రజలకు ధైర్యం ఇవ్వగలిగే స్థాయిలో జర్నలిస్టులు ఉండాలి

**తప్పుడు సమాచారం అరికట్టగలగాలి**

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, పుకార్లు, తప్పుడు సమాచారాన్ని అరికట్టడంలో బాధ్యతాయుతమైన జర్నలిజం కీలక పాత్ర పోషిస్తోంది. పోషించాలి కూడా ప్రజలకు జర్నలిజంపై విశ్వాసం కలిగించాలి.ఏది నిజం!ఏది అబద్ధం!!అన్న సంగతి స్పష్టంగా తెలిసేలా బాధ్యతగల జర్నలిజం వ్యవహరించాలి.

**కాపి టు పేస్టు కాదు**

జర్నలిస్టు కేవలం వార్తలు రాసేవాడు మాత్రమే కాదు. ప్రస్తుత సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని వార్తలను తీసుకొని కాఫీ టు పేస్ట్ చేసి పంపించడం జర్నలిజం కాదు. సమస్య ఎక్కడుంటే జర్నలిస్టు అక్కడ ఉండాలి.ప్రజల సమస్యలను పాలకుల సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే వారధి.ఆయా ప్రాంతాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి సమస్యలను, ఇంకా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి సామాజికంగా నష్టం చేసే వారికి సింహస్వప్నంలా నిలిచి వాటి పరిష్కారానికి మార్గం సుగమం చేయాల్సిన బాధ్యత చిత్తశుద్ధి గల జర్నలిజనిది.

**కార్యక్రమాల కవరేజ్ మాత్రమే జర్నలిజం కాదు**

రోజువారి కార్యక్రమాల కవరేజీ మాత్రమే జర్నలిజం కాదు.తమ సమీప దూర వ్యవస్థలో ప్రజలు పడుతున్న అవస్థలు, సమస్యలు,జరుగుతున్న అవినీతి, అక్రమాలు, సామాజిక అన్యాయాలపై నిర్భయంగా ప్రశ్నిస్తూ నూటికి నూరు శాతం అవిశ్రాంత కృషి సల్పుతూ అక్షర సమరం చేయగలిగే సత్తా పెంపొందించుకోవాలి. నిత్యం ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలి. ప్రతి దినం నూతన విషయాలను తెలుసుకునే దిశగా అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయ,సంగతులను సమాచారాలను విశేషాలను ప్రజలకు అందించే వారదులుగా కొనసాగాలి.

**దాడులకు బెదరకూడదు**

ప్రస్తుత కాలంలో జర్నలిస్టులపై అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయి. అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాజకీయ బలం అధికార బలం అంగ బలం ఆర్థిక బలం చూసుకొని వారిపైన వారు చేస్తున్న అక్రమ వ్యాపార లావాదేవీల పైన జర్నలిస్టులు కథనాలు రాసినప్పుడు ఇలాంటి బెదిరింపులు చేస్తారు. అయినప్పటికీ నిజమైన జర్నలిస్టు రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లకు అదరకుండా బెదరకుండా ముందుకు కొనసాగాలి. కాకపోతే మనం రాసిన కథనాల ప్రకారంగా ఖచ్చితంగా సాక్ష్యం ఉండాలి ఎవిడెన్స్ తప్పనిసరి లేని పక్షంలో సమస్యల్లో చిక్కుకోవాల్సి ఉంటుంది తొందరపడి కాంట్రవర్షం వార్తలు రాసి ఇబ్బందులు పడొద్దు అన్ని ఆధారాలు ఉన్నప్పుడే అక్రమాల వెలికితీత కథనాలు రాయాలి.అప్పుడే ప్రజలకు జర్నలిజంపై విశ్వాసం పెరుగుతుంది.

**మంచి గుర్తింపు**

నిజాయితీ, నిబద్ధత, నిష్పాక్షికతను పాటిస్తూ ప్రజలకు వాస్తవాలను అందించడం ప్రతి జర్నలిస్టు ధర్మం. అలాంటి వారిని సమాజం మంచి జర్నలిస్టుగా గుర్తిస్తుంది.తగిన సమయంలో సత్కరించిన సందర్భం లేకపోలేదు...సంచలనాల కోసం కాకుండా సత్యం కోసం పనిచేసే జర్నలిస్టులే సమాజంలో శాశ్వత గౌరవాన్ని పొందుతారు. ఎక్కువగా పుస్తక పఠనం పత్రికల పట్టణం చేయాలి. జర్నలిజం దృష్టితో సమాజాన్ని అన్ని కోణాల్లో అధ్యయనం చేయగలగాలి

**ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి**

గత 20 సంవత్సరాల క్రితం నాటి పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులు చూస్తే అప్పట్లో మొబైల్ ఫోన్లు అందుబాటులో రాలేదు. కేవలం ప్రజలు తీసుకొచ్చిన వార్తలను విలేకరులు సేకరించిన వార్తలను కంప్యూటర్ల ద్వారా హెడ్ ఆఫీస్ సంబంధించిన (డెస్క్) కు పంపించేది కానీ ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో పెరిగింది. మన చేతుల్లోనే ప్రపంచమంతా కనిపించే స్థాయికి ఎదిగింది. పాత తరం కొత్తతరం జర్నలిస్టులు ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి.

**స్వీయ పరిశీలన అవసరం**

ఏది ఏమైనా మనల్ని మనం ఒక్కోసారి స్వీయ పరిశీలన చేసుకొని సమాజంలో జరుగుతున్న అక్రమాలను అన్యాయాలను ఆసరాగా చేసుకొని బెదిరింపులకు పాల్పడి మనల్ని మనం చులకన చేసుకోకూడదు. హృదయపూర్వకంగా ఇష్ట పూర్తిగా మన వృత్తి చిత్తశుద్ధిని బట్టి ఎవరైనా సంతోషంగా సహకారం అందిస్తే కాదనడానికి లేదు

**వాస్తవాలను విస్మరించకూడదు**

డిజిటల్ మీడియా విస్తరించడంతో జర్నలిజం మరింత ప్రభావవంతమైంది. అయితే వేగం కోసం వాస్తవాలను విస్మరించకుండా, ప్రతి వార్తను ధృవీకరించి ప్రజలకు అందించడం అత్యంత అవసరం. ప్రజల విశ్వాసమే జర్నలిస్టుకు అతిపెద్ద సంపద

**హక్కుల సాధన...కుటుంబ సంక్షేమం**

జర్నలిస్టులుగా మన బాధ్యత సమాజాన్ని సరిచేసే వారిమి మాత్రమే అనుకోవద్దు అంతకంటే ప్రాముఖ్యంగా మన కుటుంబ సంక్షేమం ఎంతో ప్రాముఖ్యం అదేవిధంగా మన ఆరోగ్య విషయాలను విస్మరించకూడదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మనకు రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు జర్నలిస్టుల హక్కుల సాధన ఉద్యమాలలో తప్పనిసరిగా పాల్గొని మనకంటూ ఒక ప్రత్యేక ముద్రను జర్నలిజంలో వేసుకునే వారిగా ఉండాలి. జర్నలిజంలోకి కొత్తగా వచ్చిన వారికి ఆదర్శ ప్రాయమైన మార్గదర్శకాలు వేసేవారిగా ఉండాలి. అంతే గాని సొంత లాభం స్వార్థం నేనే బతకాలి నేనే ఉండాలి నేనే జర్నలిస్టును అన్న నియంత పోకడలను చేసేవారు జర్నలిస్టు అని చెప్పుకోకూడదు.వసూలు రాజా అని చెప్పుకోవాలి... జర్నలిజంపై మరో కథనంతో మరిన్ని విషయాలతో త్వరలో కలుద్దాం

సీనియర్ పాత్రికేయులు

కందుకూరి యాదగిరి సూర్యాపేట

# మళ్లీ వల్లభనేనికి కోర్టు తిప్పలు

విజయవాడ, ఆగస్టు 3, గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బహిర్గతం చేయడం పెద్ద చర్చకు దారితీసింది. పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలు, ప్రభుత్వ పనుల కాంట్రాక్టులలో సాగిన అవినీతిని ఆయన బయటపెట్టారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాలనలో జరిగిన ఈ దోపిడీపై విజిలెన్స్ నివేదికలు కూడా స్పష్టమైన నిజాలు వెల్లడించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోట్ల విలువైన సహజ వనరులను తరలించారని ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతతోనే తాను ఈ నిజాలను బయటపెట్టానని యార్లగడ్డ గట్టిగా చెబుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు కారణం అవుతున్నాయి.అక్రమాలు బయటపడతాయనే భయంతో మాజీ ఎమ్మెల్యే వంశీ లీగల్ నోటీసుల మార్గాన్ని ఎంచుకున్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఆయన పంపుతున్న నోటీసులు కేవలం భయపెట్టే ప్రయత్నాలని కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయాక చట్టపరమైన ముసుగులో తప్పించుకోవాలని చూడటం సరికాదని విమర్శకులు అభిప్రాయపడుతున్నాయి. కోర్టుల ద్వారా భయపెట్టి నోరు మూయించవచ్చనే ఆలోచన కేవలం భ్రమేనని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం మాజీ ఎమ్మెల్యే రాజకీయ బలహీనతను స్పష్టంగా బయటపెడుతోంది.బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధైర్యంగా ప్రకటిస్తున్నారు. చట్టబద్ధంగా ఏ వేదికపైనైనా ఈ దోపిడీని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. కోర్టులకు వెళ్తే అసలు నిజాలు, మట్టి తవ్వకాలకు సంబంధించిన పక్కా ఆధారాలన్నీ బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించింది నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయడానికే తప్ప ఇలాంటి లీగల్ నోటీసులకు భయపడటానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ద్వారా ఆయన తన పట్టును నిరూపించుకుంటున్నారు. ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.గన్నవరం నియోజకవర్గ ప్రజలు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను నిశితంగా గమనించారు. విమానాశ్రయం పరిసరాల్లో జరిగిన పనులలోనూ భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా తరలించిన వేలాది ట్రక్కుల మట్టి లారీలు రోడ్లను ధ్వంసం చేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువత ఈ విషయాలను సోషల్ మీడియా వేదికగా విశ్లేషిస్తూ నిలదీస్తున్నారు. పాత తప్పులను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులు పంపడం పట్ల ప్రజల్లో వ్యంగ్యమైన చర్చ నడుస్తోంది. అభివృద్ధిని విస్మరించి కేవలం అక్రమ సంపాదన మీద దృష్టి పెట్టడం వల్లే నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని యువత భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.మొత్తానికి గన్నవరం రాజకీయం ప్రస్తుతం అత్యంత రసవత్తరమైన దశకు చేరుకుంది. యార్లగడ్డ వెంకట్రావు దూకుడు వల్ల వంశీ వర్గంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిని అంతం చేసే వరకు విశ్రమించేది లేదనే సంకేతాలను ప్రస్తుత నాయకత్వం బలంగా ఇస్తోంది. సోషల్ మీడియా ట్రెండ్స్ ప్రకారం చూస్తే ఈ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ప్రజలు కూడా నిజాలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ పోరు కోర్టుల ద్వారా ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. గన్నవరం అభివృద్ధి సాధించాలంటే ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా అవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

### కత్తిపోట్లతో వ్యక్తి దారుణ హత్య

నిర్మల్ మామడ మండలం పోతారం గ్రామం నందు నిన్న అర్ధరాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. కత్తిపోట్ల ఘటనలో గ్రామానికి చెందిన పెద్దోల్ల లింబాద్రి (45) కత్తి పోట్లకు గురయ్యాడు, వెంటనే గమనించిన గ్రామస్తులు తీవ్రంగా గాయపడిన లింబాద్రిని 108 అంబులెన్స్ లో నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు, పరీక్షించిన వైద్యులు అప్పటికే లింబాద్రి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భూ తగాదాల నెపథ్యంలో ఈ హత్య జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లింబాద్రి అన్న పెద్దోళ్ళ భూమన్న కత్తితో పొడిచి హత్య చేసినట్టు తెలుస్తోంది పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు.

# కంచుకోటలో సవాళ్లు....

అనంతపురం, ఆగస్టు 3 ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి.చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టు కోవాలనే ప్రయత్నం లో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం. ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్ఠానం సమయానికి చక్కదిద్ది, నాయకత్వం మరియు కేడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం టీడీపీకి అత్యంత కీలకమైన అంశంగా మారింది.

### ఎంపి చిన్ని జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చిన్ని పుట్టినరోజు వేడుకలు నందిగామ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నియోజకవర్గ పరిశీలకులు తల్లా వెంకటేష్ యాదవ్ , కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి వారి కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎంపీ చిన్ని కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కూటమి ప్రభుత్వంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని చేస్తున్న కృషిని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్న నేపథ్యంలో, ప్రజా ప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గాల అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.కూటమి నాయకత్వం, కార్యకర్తల మధ్య ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఎంపీ కేశినేని చిన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆకాంక్షించారు.

# టీటీడీ ఫేక్ వెబ్‌సైట్ కలకలం..!

తిరుమల, ఆగస్టు 3, కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనం కోసం వేచి చూసే అమాయక భక్తులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో సరికొత్తగా ఒక నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. 'బిబిటటవలజీబబిష్ట్రజీనిజీఎ.నీనిశ్రీతినివ' అనే పేరుతో చలామణి అవుతున్న ఈ నకిలీ వెబ్‌సైట్ వ్యవహారం ప్రస్తుతం భక్తులలో తీవ్ర కలకలం రేపుతోంది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ఏ విధంగా ఉంటుందో, అచ్చం అదే తరహా డిజైన్, రంగులు మరియు ఫోటోలను ఉపయోగించి సైబర్ కేటుగాళ్లు ఈ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించడం గమనార్హం. ఈ నకిలీ వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం , వివిధ రకాల సేవా టికెట్లు మరియు తిరుమలలో వసతి గదుల బుకింగ్స్ పేరుతో భక్తులను నమ్మించి మోసగించడానికి నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారు. టీటీడీ అధికారిక కోటా విడుదల కాని సమయంలో కూడా ఈ సైట్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తుల నుండి భారీగా డబ్బులు వసూలు చేసేందుకు వల విసిరారు. ఇంటర్నెట్‌లో నిజమైన సైట్ ఏదో తెలియక చాలా మంది భక్తులు ఈ ఫేక్ లింక్‌లను క్లిక్ చేసి తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను నమోదు చేసి మోసపోయే ప్రమాదంలో పడ్డారు. ఈ నకిలీ వెబ్‌సైట్ ఉదంతంపై తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తీవ్రంగా స్పందించారు. ఇలాంటి నకిలీ వెబ్‌సైట్లను భక్తులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ లింక్‌ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. శ్రీవారి దర్శన టికెట్లు, లడ్డూలు లేదా వసతి గదుల బుకింగ్ కోసం కేవలం అధికారిక వెబ్‌సైట్ అయిన 'బిబిటవలజీబబిష్ట్రజీనిజీఎబ.జీజూ.ణనీల.తిని' లేదా అధికారిక మొబైల్ యాప్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఈ నకిలీ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటీ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# రేవంత్ బాటలో డీకే...

బెంగళూరు, ఆగస్టు 3 ఎన్నికల సమయంలో వేసే రాజకీయ ఎత్తుగడలు, విమర్శలు వేరని.. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన విషయానికి వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే నిజమైన రాజధర్మమని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నిరూపించారు. శనివారం మైసూరులోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక వివేకనంద స్మారక యూత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో వేదిక పంచుకున్న డికేఎస్, సభాముఖంగా ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. "మా ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక వేడుకకు రావడం చాలా గర్వకారణం" అని కొనియాడారు. "రాష్ట్ర అభివృద్ధి విషయంలో మొత్తం కర్ణాటక మీతో నిలబడుతుంది. మనం అంతా కలిసి పనిచేద్దాం. కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం కూడా వృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కర్ణాటకకు విశాల హృదయంతో సహాయం అందించి, ఆదుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తనకు మాట్లాడేందుకు కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉందని, ప్రధాని మోదీ దేశ ప్రజలకు ఇచ్చే సందేశం చాలా కీలకమైనదని, కాబట్టి తన సమయాన్ని వృథా చేయబోనంటూ ఆయన వేదికపై గౌరవప్రదంగా ప్రసంగాన్ని ముగించడం, ఆ తర్వాత ప్రధాని మోదీ ? డికేఎస్ ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఆప్యాయంగా నడుచుకుంటూ వెళ్లడం మీడియాలో హైలైట్ అయ్యింది. రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలు, విమర్శలు సహజమే అయినప్పటికీ, అధికారంలోకి వచ్చాక కేంద్రంతో వైరం పెట్టుకుంటే నిధుల కేటాయింపులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతిని చివరికి రాష్ట్రానికే తీవ్ర నష్టం జరుగుతుందనే పచ్చి నిజాన్ని డి.కె. శివకుమార్ గుర్తించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కేంద్రంతో సత్సంబంధాలు నెరపుతూ రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకోవడమే ఉత్తమ మార్గమని ఆయన భావించారు.

రాజకీయ వేదికలపై ప్రత్యర్థులుగా పోరాడినా, పాలనా వ్యవస్థలోకి రాజకీయాలను తీసుకురాకూడదనే ఒక స్పష్టమైన దృక్పథాన్ని ఈ పరిణామం ద్వారా ఆయన చాటిచెప్పారు. సరిగ్గా ఇదే తరహా పరిణతి కూడిన వ్యూహంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా మొదటి నుంచి పయనిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రగతి , మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, బడ్జెట్ నిధుల కోసం ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను పలుమార్లు కలసి వినతులు అందించారు. కేంద్రంతో మేము యుద్ధం చేయం.. రచ్చ చేయం.. కలసి పనిచేసి రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించుకుంటాం అనే ముక్కుసూటి పాలసీని రేవంత్ పాటించారు.

ఇప్పుడు కర్ణాటకలో డి.కె. శివకుమార్ కూడా అదే రేవంత్ మోడల్‌ను అనుసరిస్తూ, పరిపాలనకు-రాజకీయాలకు మధ్య గీత గీసి ముందుకు సాగడం దక్షిణాది కాంగ్రెస్ పాలనలో సరికొత్త రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోంది.

# కాంగ్రెస్ తో కటీఫ్...

# మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ

హైదరాబాద్, ఆగస్టు 3,చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది. గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఇతర కులాలను సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యలు ఆయనకున్న న్యూట్రల్ ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని దారి తప్పిన నాయకుడిగా మిగిలిపోయారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం ఓటు బ్యాంకు అండగా ఉండవు. ప్రధాన పార్టీలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు కాబట్టి పోటీ మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన తీవ్రంగా భావిస్తున్నారు. పాదయాత్రలు చేయడం తేలికే అయినా పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి ప్రహసనంలా మారుతుంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప రాబోయే ఎన్నికల పోరు ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. లేకపోతే ఆయనను పట్టించుకునే వారే కరువవుతారు.

## నిరుద్యోగుల మెరుపు సమ్మె

హైదరాబాద్ ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగులు ల మెరుపు ధర్నాకు దిగారు. 7,437 పోస్టులతో కాకుండా 19 వేల పోలీస్ ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేయాలి . పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలంటూ డిమాండ్ చేసారు. నోటిఫికేషన్ ఆలస్యంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పోలీస్ నోటిఫికేషన్లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేసారు. దరఖాస్తు రుసుమును వెంటనే తగ్గించాలని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరుద్యోగుల హెచ్చరించారు.


# నేతన్నల ఇన్ స్టా బాట

న్యూఢిల్లీ, ఆగస్టు 3, దేశ రాజకీయాల్లో ఇప్పుడు గాలి మారింది. ఒకప్పుడు ప్రెస్ మీట్లు, కరపత్రాలతో సాగిన రాజకీయం.. ఆ తర్వాత ఫేస్‌బుక్ కథనాలు, ఎక్స్ వార్లకు మారింది. కానీ ఇప్పుడు ఆ పాత వేదికలన్నీ బామ్మల కాలం నాటి ముచ్చట్లుగా మారిపోయాయి. పొలిటికల్ లీడర్లంతా ఇప్పుడు హుటాహుటిన ఇన్‌స్టాగ్రామ్ బాట పడుతున్నారు. కారణం ఒక్కటే.. ఓటర్లలో నిశ్శబ్దంగా పెద్ద శక్తులుగా మారుతున్న జెన్ జీ ఎక్స్ ను సమాచారం తెలుసుకోవడానికి వాడుకుంటున్నారు. ఫేస్‌బుక్‌కు అసలు గుడ్ బై చెప్పేశారు. వారు రోజంతా పడికాపులు కాసేది కేవలం ఇన్‌స్టా రీల్స్, షార్ట్స్ లోనే. అందుకే ఇప్పుడు రాజకీయం నడవాలంటే కుడిచేతి బొటనవేలితో స్వైప్ చేసే రీల్స్ పవర్ కావాల్సిందేనని నేతలు డిసైడ్ అయ్యారు .విషయం ఎంత తీవ్రంగా ఉందంటే.. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా జెన్ జీ భాషలోనే సంభాషించడానికి ఇన్‌స్టా వేదికగా ఫ్రంట్-కెమెరా సెల్ఫీ వీడియోలు , రీల్స్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. 10.5 కోట్లకు పైగా ఫాలోవర్లతో డిజిటల్ స్పేస్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రధాని నుంచి మొదలుకొని, స్థానిక వార్డు మెంబర్ దాకా అందరూ ఇన్‌స్టా అల్గారిథమ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ అనేది కేవలం ప్రెస్ రిలీజ్ పోస్ట్ చేసుకునే ఆఫీస్ బోర్డుగా మారిపోగా.. ప్రచారాన్ని, వ్యక్తిత్వాన్ని వైరల్ చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్ ఒకే ఒక్క అస్త్రంగా మారింది. యువతను ఆకట్టుకోవాలంటే వారి మైండ్ సెట్‌కు తగ్గట్టుగా కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో పొలిటికల్ వార్ రూమ్‌లు కూడా ఇప్పుడు పిఆర్ ఏజెన్సీలతో రీల్స్ ప్రాజెక్టులు డిజైన్ చేయిస్తున్నాయి. దశాబ్దాలుగా పొడుగాటి పంచెలు, మైకులు పట్టుకుని ఐదు పేజీల మైక్ ఉపన్యాసాలు దంచేసే పాతతరం రాజకీయ నేతలకు.. ఈ 15 సెకన్ల రీల్స్ లాజిక్ అర్థం కాక చమటలు పడుతున్నాయి. జెన్ జీని మెప్పించడం కోసం కెమెరా ముందుకొచ్చి నిలబడటం, కుర్రాళ్లతో కలిసి ట్రెండింగ్ ఆడియోలకు హావభావాలు ఇవ్వడం, నేరుగా ఫోన్ వంక చూస్తూ హేయ్ గైస్ '' అని పలకరించడం.. పాపం మన పొలిటీషియన్లకు పెద్ద అగ్నిపరీక్షలా మారింది. సెల్ఫీ యాంగిల్ సరిగ్గా కుదరక, మాట్లాడే స్టైల్ మోతాదు మించడంతో అనేక మంది నేతల ప్రయోగాలు మీమర్స్ కి కడుపుబ్బ నవ్వించే డైలీ కంటెంట్‌గా మారిపోతున్నాయి.

మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ చాలా విచిత్రమైనది. అక్కడ గంభీరమైన రాజకీయ ప్రసంగాలు చెల్లవు. జెన్ జీకి నచ్చే సరదా స్లాంగ్ , పాప్ కల్చర్ ట్రెండ్స్, కట్-షార్ట్ ఎడిటింగ్ లేకపోతే ఆ రీల్‌ను క్షణాల్లో పైకి నెట్టేస్తారు. దీంతో పొలిటికల్ పార్టీల సోషల్ మీడియా వింగ్స్.. తమ లీడర్లను ఇన్‌ఫ్లుయెన్సర్లు గా మార్చేందుకు తంటాలు పడుతున్నాయి. ఏ నాయకుడు ఏ బ్రాండ్ టీషర్ట్ వేసుకున్నారు, ఏ కాఫీ షాప్‌లో కూర్చున్నారు, యువతతో కలిసి ఎలాంటి ఫన్నీ కౌంటర్లు వేశారనే కట్-షాట్స్ కోసం ఏకంగా కెమెరా టీమ్‌లను వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. నాన్-స్టాప్ పొలిటికల్ పోరాటాల కంటే రీల్స్‌కు వచ్చే లైకులు, కామెంట్లు, షేర్లే ఇప్పుడు నాయకుల పవర్‌ను కొలిచే కొలమానంగా మారాయి. ఓటు బ్యాంకు కోసం లీడర్లు పడే తిప్పలు ఇప్పుడు కేవలం వీధుల్లో పాదయాత్రలకే పరిమితం కాలేదు.. ఇన్‌స్టా స్క్రీన్ల పైకి చేరాయి. జెన్ జీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అలవాటు లేని పనులు చేస్తూ, కుర్రాళ్ల ట్రెండ్స్‌ను అనుకరిస్తూ రాజకీయ నాయకులు పడుతున్న ఆర్గానిక్ అవస్థలు సామాజిక మాధ్యమాల్లో రక్తికట్టి స్తున్నాయి. ఎంత కష్టమొచ్చినా సరే.. ట్రెండింగ్ లోలేకపోతేరాజకీయంలో ఉనికికే ప్రమాదమని గుర్తించిననేతలు,అలవాటు లేనిఈఇన్‌స్టా దారి లోకిందామీదాపడుతూపయనించక తప్పడం లేదు!

# రంగనాధ్ తప్పిస్తారా !

హైదరాబాద్, ఆగస్టు 3,హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చుట్టూ న్యాయపరమైన ముళ్లకంప అల్లుకుంటోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే లేదా ఒకరి తర్వాత ఒకరుగా ఏకంగా ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ ఏజెన్సీ తీరుపై, దాని అధిపతి ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వైఖరిపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. బుల్డోజర్ సంస్కృతి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు దిగడం, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం వంటి చర్యలపై న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టాయి. లోతుకుంట భూ వివాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించినంది. హైడ్రాను పౌరాణిక రాక్షస మృగంతో పోల్చిన న్యాయమూర్తి, తమను తాము సూపర్ కాప్స్ గా భావించుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. కేవలం ఈ ఒక్క బెంచ్ మాత్రమే కాకుండా, ఇతర న్యాయమూర్తులు కూడా వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా నోటీసులు ఇవ్వకుండా చేపడుతున్న ఆకస్మిక చర్యలను, విచారణాధికారాల అతిక్రమణను తీవ్రంగా తప్పుబట్టారు. స్వయంగా కమిషనర్ రంగనాథ్ దాదాపు 62 కోర్టు ధిక్కరణ కేసుల్లో నిందితుడిగా ఉండటం న్యాయవ్యవస్థ తీవ్రంగా పరిగణించిన అంశంగా మారింది. హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా, బ్రాండ్ హైదరాబాద్ పునరుద్ధరణగా ప్రచారం చేసుకున్నారు. ప్రారంభంలో ప్రజల నుంచి, పర్యావరణ వేత్తల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే ప్రస్తుతం ఏజెన్సీకి గొడ్డలిపెట్టుగా మారింది. ప్రతిపక్షాల విమర్శల కంటే కూడా, న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న ప్రతికూల తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద సవాలుగా పరిణమించాయిహైకోర్టు ఏకంగా సీఎస్‌ను ఉద్దేశించి న్యాయసమ్మతమైన ఆదేశాలను గౌరవించే అధికారిని నియమించండి అని స్పష్టమైన సూచన




చేయడంతో ఇప్పుడు బంతి రేవంత్ రెడ్డి కోర్టులోకి చేరింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి రంగనాథ్‌ను అదే పోస్టులో కొనసాగిస్తే, అది ప్రభుత్వం , న్యాయవ్యవస్థ మధ్య మరింత ఘర్షణ వాతావరణానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వం ఆశించిన హైడ్రా అసలు లక్ష్యం పక్కదారి పట్టి, కేవలం చట్టవిరుద్ధమైన ఏజెన్సీగా ముద్రపడే ప్రమాదముంది. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎ.వి. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మరొక అధికారికి బాధ్యతలు అప్పగించడం ద్వారా కోర్టు ఆదేశాలను గౌరవించినట్లవుతుందని, అలాగే ఏజెన్సీపై పడిన మరకను చెరిపేసి చట్ట పరిధిలోనే ఆక్రమణలపై చర్యలు కొనసాగించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో హైడ్రా నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రంగనాథ్ పనులకు ఫుల్ పబ్లిసిటీ

హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చేపట్టిన సంస్కరణల సత్ఫలితాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు దుర్గంధంతో అలమటిస్తూ, ఆక్రమణల కోరల్లో చిక్కుకుని మురుగు నీటి కుంటలా మారిన ఉప్పల్ నల్లచెరువు'.. నేడు కన్నులపండువగా, ఆహ్లాదకరమైన వాతావరణంతో పునరుజ్జీవం పోసుకుంది. చెరువును ఆధునీకరించి, సుందరీకరించిన తీరుపై ఉప్పల్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కొన్నేళ్లుగా నల్లచెరువు పరివాహక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, ప్లాస్టిక్ చెత్తతో నింపేయడం, అక్రమ నిర్మాణాలు వెలియడంతో చెరువు తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరింది. వర్షం వస్తే చాలు పరిసర కాలనీలైన పీఏసీఎస్ కాలనీ, ఉప్పల్ ప్రధాన రహదారులు జలమయమయ్యేవి. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన హైడ్రా, జీహెచ్ఎంసీతో కలిసి సమగ్ర కార్యాచరణను చేపట్టింది. చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా, టన్నుల కొద్దీ పూడిక, చెత్తాచెదారాన్ని స్వల్పకాలంలోనే తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది. చెరువులోకి మురుగునీరు నేరుగా చేరకుండా డైవర్షన్ ఛానెళ్లను ఏర్పాటు చేసి, గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించారు. చెరువు కట్టను బలపరిచి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, సందర్శకుల కోసం సుందరమైన బెంచీలు, పచ్చదనంతో కూడిన ల్యాండ్‌స్కేపింగ్‌ను తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో ఉప్పల్ వాసులు, చిన్నారులు, వృద్ధులు ప్రశాంతంగా గడిపేందుకు ఈ ప్రాంతం ఒక అద్భుతమైన వాకింగ్ అండ్ రీక్రియేషన్ స్పాట్ గా రూపాంతరం చెందింది. హైడ్రా పనుల పుణ్యమా అని దుర్గంధం, దోమల బెడద నుంచి విముక్తి లభించిందని, ఆస్తి విలువలు కూడా పెరిగాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా చెరువు బిఫోర్ ? ఆఫ్టర్ వీడియోలు, ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేవలం కూల్చివేతలకే పరిమితం కాకుండా.. ప్రజాధనం వృథా కాకుండా చెరువులను పునరుద్ధరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా తన ప్రత్యేక ముద్రను వేసిందని నెటిజన్లు, ఉప్పల్ వాసులు కొనియాడుతున్నారు.

# కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు

కరీంనగర్, ఆగస్టు 3, తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్‌లోనూ, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్‌లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు.

ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్ద ఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలు ఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా ఇసుక కొట్టుకుపోయి, రాఫ్ట్ దిగువన పెద్ద ఎత్తున శూన్య ప్రాంతాలు ఏర్పడ్డాయి. 6 వెంట్స్ వద్ద పదికి పైగా విభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది.

అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది.ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది

# కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ?

హైదరాబాద్, ఆగస్టు 3 తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్-జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్ అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలను రీ-బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవ తెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్-జీ తీవ్రస్థాయిలో రీ-కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్ట్ పార్టీ పెట్టేలా యువజన సమూహాలను ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్-జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్ ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యాసంస్కరణలేనని కాంగ్రెస్ వర్గాలు సమర్థిస్తున్నాయి. డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేని విద్యార్థులను తీర్చిదిద్దడానికి జర్మనీ, ఫిన్లాండ్ మోడల్స్‌లో మొదటి రెండేళ్లు బేసిక్ విద్య, చివరి రెండేళ్లు ప్రాక్టికల్ విదేశీ లాంగ్వేజెస్, అప్రెంటిస్‌షిప్ నైపుణ్యాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొంటున్నారు. అయితే, విధానపరమైన లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో వాడిన క్రిమినల్ వేస్ట్ అనే పదం కమ్యూనికేషన్ ఫెయిల్యూర్‌గా మారి, రాజకీయ ప్రత్యర్థులకు రాజకీయ ఆయుధంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు జెన్-జీ అసంతృప్తిని క్రిమినల్ వేస్ట్ ఉద్యమంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా, అది ఎంతకాలం మనుగడ సాగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్

అదిలాబాద్, ఆగస్టు 3, ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణఉలకు పిలుపునిచ్చారు.మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు.

తాను ఎంపీగా ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్షం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తే స్థానిక ఎమ్మెల్లే శంకర్ తానే చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దీన్ని పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేను ఓడగొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని పిలుపునిచ్చారు

# విద్యా వ్యవస్థ అంత దారుణమా...

హైదరాబాద్, ఆగస్టు 3 మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు లక్షా పదివేల మంది విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పట్టాలు పొందుతున్నారు. కానీ ఈ పట్టాలు చేతపట్టుకుని బయటకు వస్తున్న యువతలో కేవలం పదిహేను శాతం మంది మాత్రమే పరిశ్రమల ప్రమాణాలకు సరిపోతున్నారు. మిగిలిన మెజారిటీ విద్యార్థులు కనీసం ప్రాథమిక కోడింగ్ లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పరిస్థితిని ప్రస్తావిస్తూ కఠినమైన పదాలు వాడారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మాటల శైలి వేరుగా ఉన్నప్పటికీ వారిద్దరి ఆవేదన వెనుక ఉన్న ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపమే.సాంకేతిక విద్య ఈ స్థాయికి దిగజారడానికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయం కావడమే. గత కొన్ని సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కళాశాలల్లో తగినంత మౌలిక వసతులు అసలే లేవు. ఆధునిక ప్రయోగశాలలు లేకపోవడం అలాగే అనుభవం ఉన్న నాణ్యమైన అధ్యాపకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా దూసుకుపోతుంటే చాలా కాలేజీలు ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే బోధిస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు కేవలం పుస్తకాల్లోని విషయాలను గుడ్డిగా గుర్తుపెట్టుకుని రాసే రీతిలోనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యార్థుల్లో సమస్యలను స్వయంగా పరిష్కరించే ధోరణి పూర్తిగా కరువవుతోంది.తల్లిదండ్రులు తమ కష్టపడిన సంపాదనతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు సాయాన్ని కలిపి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పిల్లలను ఎంతో ప్రయాసపడి ఇంజినీరింగ్ చదివిస్తే డిగ్రీ పూర్తయ్యాక ప్రైవేట్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు రావడం లేదు. దీనితో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోతూ చివరకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇంజినీరింగ్ పాసైన కుర్రాడు కనీసం చిన్న ఉద్యోగానికైనా సరిగ్గా వెళ్లలేకపోతున్నాడనే ఆవేదన పాలకులలో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలలో ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం లేదు. అక్కడ కనిపిస్తున్నది సమాజం ముందున్న ఒక స్పష్టమైన వాస్తవం.పరిశ్రమల అవసరాలకు తగ్గ ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన శిక్షణ లేని కారణంగా కనీసం ఒక చిన్న దరఖాస్తును కూడా సరిగ్గా రాయలేని స్థితిలో విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం విమర్శలు సరిపోవు కానీ సరైన ప్రణాళికలు అవసరం. కాలేజీలు కేవలం మార్కులు అలాగే సర్టిఫికెట్లు ఇచ్చే యంత్రాలుగా మారడం వల్ల సమాజానికి ఒరిగేది ఏమీ లేదు. సాంకేతిక రంగంలో ప్రపంచంతో పోటీపడే అర్హతలను అందించేలా విద్యాప్రమాణాలు పూర్తిగా మారాలి. అప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది.ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా సులభమైన మంచి తెలుగులో మన విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసుకోవాలి. యువత కేవలం డిగ్రీ పత్రాల కోసం కాకుండా నిజమైన నైపుణ్యాలు సంపాదించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వం కూడా కాలం చెల్లిన సిలబస్‌ను మార్చి పరిశ్రమలకు కావాల్సిన కోర్సులను కాలేజీల్లో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై గర్వంగా నిలబడగలుగుతాడు. నేటితరం యువతకు కావాల్సింది కేవలం డిగ్రీ కాదు కానీ అద్భుతమైన సృజనాత్మకత. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్ వేధింపులతో ఉయ్యూరులో వివాహిత ఆత్మహత్యాయత్నం

విజయవాడ మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్ వేధింపులతో ఉయ్యూరులో వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. భీమవరంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న వాణి భర్త కుమార్ వద్ద ఉయ్యూరు కు చెందిన వినాయక్ బాబు వ్యక్తి ఫైనాన్స్ పద్ధతిలో లారీ కొనుగోలు చేసాడు. లారీ కొనుగోలు సమయంలో కొనుగోలు చేసిన వ్యక్తి పేరుపై లారీని మార్చేందుకు 40 రోజులకు అగ్రిమెంట్ రాసుకున్నారు. అగ్రిమెంట్ ఉందనే నమ్మకంతో వినాయక్ బాబు దాదాపు 3 లక్షలకు పైగా ఖర్చు చేసి లారీకి మరమత్తులు చేయించుకున్నాడు. 40 రోజుల దాటిన కొనుగోలు చేసిన వ్యక్తి పేరుపై లారీని మార్చు 4చేందుకు కుమార్ ముందుకు రాలేదు. తొలుత భీమవరం పోలీస్ స్టేషన్ లో లారీ పంచాయతీ జరిగింది. కుమార్ భార్య భీమవరంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ కావడంతో తొలుత పడమట, ఆ తర్వాత పెనమలూరు పోలీస్ స్టేషన్లో కుమార్ కేసులు పెట్టాడు. పెనమలూరు పోలీస్ స్టేషన్ లో రెండు రోజుల పాటు జరిగిన కేసు విచారణ జరిగింది. కుమార్ భార్య ఎక్సైజ్ కానిస్టేబుల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారుల అండదండలతో తాము వేధింపులు ఎదుర్కోన్నారని బాధితులు ఆరోపించారు. కుమార్ భార్య కానిస్టేబుల్ వాణి పెనమలూరు పోలీస్ స్టేషన్లోనే బాధితులపై మాటల దాడికి దిగింది. చంపేస్తామంటూ బెదిరించింది. పోలీసులు ఎటు తేల్చకపోవడంతో మానసిక ఆవేదనతో వినాయక్ బాబు, ఆయన భార్య వాణి ఉయ్యూరులో ఆత్మహత్యాయత్నం చేసారు. ఉయ్యూరులో పుల్లేరు కాలువలో దూకిన వినాయక్ బాబును స్థానికులు కాపాడారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ వాణి వేధింపులతో విసిగిపోయి వినాయక్ బాబు భార్య వాణి ఆత్మహత్యాయత్నం చేసింది. ఎలకల మందు తినడంతో హుటాహుటిన ఉయ్యూరు ప్రభుత్వ హాస్పటల్ కు తరలించారు. ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వైద్యం అందిస్తున్నారు.

# అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

ఖమ్మం, ఆగస్టు 3 తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1.40 లక్షల మేలైన మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధి కిందికి సంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 12 మండలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సరికొత్త ఫ్యాక్టరీతో తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశ్రమల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు, అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లా నర్మెటలో గంటకు 30 టన్నులతో కర్మాగారాలు నడుస్తుండగా.. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకి వస్తోంది. ఇదే కాకుండా కల్లూరుగూడెం, బీచ్‌పల్లి, ఇంచర్ల, పెద్దరాత్‌పల్లి, సంకిరెడ్డిపల్లి, యాచారంలలో నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు కర్మాగారాలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ప్రాజెక్టులో ఏర్పాటు కానున్న సీడ్ గార్డెన్ దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మలేసియా కంపెనీ భాగస్వామ్యంతో గోద్రెజ్ సంస్థ ఈ విత్తన తోటను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. దీని ద్వారా రైతులకు తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలు లభిస్తాయని ఇవి అంతర్గత పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రైవేటు సమీకృత పరిశ్రమ రాకతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత వేగంగా పెరగనుందని ఆయన వెల్లడించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను తమ ప్రభుత్వం ప్రొత్సహిస్తుందని చెప్పారు.

# ఈనెల ఏడున నేతన్న సేవలో పథకం

## మంత్రి సవిత

అమరావతి రాష్ట్ర సచివాలయంలో నేతన్న సేవలో పథకంపై మంత్రి సవిత సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చేనేత, జౌళి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, వివిధ జిల్లాలకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గోన్నారు. మంత్రి మాట్లాడుతూ నేతన్న సేవలో పథకం కింద చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం ఇస్తున్నాం. ఆర్హులైన నేతన్నలందరికీ నేతన్న సేవలో పథకం అమలు చేస్తాం. ఈ నెల 7న చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టాం. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు గడువు .గడువులోగా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలి. అర్హులైన నేతన్నలందరికీ నేతన్న సేవలో పథకం వర్తింపజేసేలా జిల్లాలో చేనేత, జౌళి శాఖాధికారులు కృషి చేయాలని అన్నారు.

నేతన్నల గౌరవప్రదమైన జీవనం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం . ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని అన్నారు.

## ఉరవకొండలో ఉద్రిక్తత
## మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అరెస్ట్

ఉరవకొండ సోమవారం నాడు ఉరవకొండ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం.. తోపులాట జరిగింది. అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మంత్రి పయ్యావుల కేశవ్ కుట్ర రాజకీయాలకు నిరసనగా వైసీపీ ధర్నా కు ప్రయత్నించింది. వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఉరవకొండలో పోలీసులు ఉరవకొండలో భారీగా మోహరించారు.

విడపనల్ మండలం వేల్పుమడుగులో వైసీపీ నేత గోవిందు్కు చెందిన 21 ఎకరాల భూమిని ఆలయ భూమిగా కూటమి నేతలు పేర్కొంటున్నారు.ఆ భూమి ప్రైవేటు భూమి అని రెవెన్యూ అధికారులు స్పష్టం చేసారు. ఈ మేరకు . వైసీపీ నేతకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా మంత్రి పయ్యావుల కేశవ్ ఒత్తిడితో హైకోర్టు ఆదేశాలు అధికారులు ఖాతరు చేయలేదని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసారు. నిరసనగా ఉరవకొండలో ధర్నాకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు.

### అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటన



అద్దంకి లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. పుట్టావారిపాలెం క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. అద్దంకి పట్టణ పరిధిలో రక్షిత మంచినీటి పథకం అమలుపై మంత్రి చర్చించారు. ఇప్పటికే రూ. 101.96 కోట్లతో పనులు అధికారులు ప్రారంభించారు. పట్టణ పరిధిలో 51 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉండేలా ట్యాంకులు నిర్మాణం, 83 కి.మీ మేర నీటి సరఫరా లైను, 15 కి.మీ మేర ఫీడర్ ఛానెల్ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజు 12 మిలియన్ లీటర్ల పంపిణీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది. రూ. 5.10 కోట్లతో పట్టణ పరిధిలోని ఊర చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

## సీఆర్డీయే అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష



అమరావతి సచివాలయంలో సీఆర్డీఏ ఇంజినీర్లు,కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యకరమానికి ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్,ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలరెడ్డి,చీఫ్ ఇంజినీర్లు తదితరులు హాజరయ్యారు. అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల పనుల పురోగతిపై చర్చ జరిగింది. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల పనులు జరుగుతున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు.



వర్షాకాలంలోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## బద్వేల్ పెద్ద చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



బద్వేల్ పట్టణం పెద్ద చెరువులో సోమవారం ఒక వివాహిత మహిళా దూకి ఆత్మహత్య చేసుకుంది పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్వేల్‌కు చెందిన ఆదిలక్ష్మి (50) అనే మహిళ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురవుతోంది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన ఆమె, ముందుగా పేడలో చల్లుకునే పురుగుల మందు (పౌడర్) తాగింది. అనంతరం పట్టణంలోని పెద్ద చెరువు వద్దకు చేరుకుని అందులోకి దూకేసింది.గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, ఆమె అప్పటికే నీట మునిగి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న బద్వేల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులోంచి బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకుని, శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## ఎరువుల సొసైటీలో చోరీకి యత్నం

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నాగేపూర్ ఎరువుల సొసైటీలో తాళం పగులగొట్టి ముగ్గురు దుండగులు లోపలికి దూరారు. లోపల నగదు, విలువైన వస్తువులు దొరకక పోవడంతో వెనుదిరిగారు. దొంగలకు సంబంధించిన కదలికలు సీ సీ ఫుటేజ్ లో దృశ్యాలు రికార్డు అయ్యాయి.

### మునిగిపోనున్న సంగమేశ్వరుడు

నంద్యాల ప్రసిద్ధి చేందిన సంగమేశ్వరం దేవాలయం శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ లో జలాధివాసానికి చేరువలో ఉన్నది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్ట్ లో 849.6 అడుగులు నీటి మట్టం ఉన్నది.. 841 అడుగులు చేరుకోగానే గర్భ గుడిలోకి నీళ్లు ప్రవేశిస్తాయి.867 అడుగులు శ్రీశైలం నీటి మటం చేరగానే గుడి మొత్తం మునిగిపోతుంది. మరల 8 నెలలు తరవాత దర్శనం కి వీలు పడ్తుంది.

## అమెరికాలో ఆట మహాసభల్లో పాల్గోన్న ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికాలో జరుగుతున్న 'ఆట' (ఐం) మహాసభల్లో రెండవ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలకు విచ్చేసిన ప్రవాస తెలుగు సోదరసోదరీమణులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తరువాత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. ఖండాంతరాల్లో కూడా మన తెలుగు వారు ఐకమత్యంతో మన సంస్కృతిని చాటిచెబుతుండటం ఎంతో ఆనందంగా ఉందని అయన అన్నారు..

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

విజయవాడ హిందూపురం ఘటనకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బెజవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు బహిష్కరణ నిర్వహించారు. హిందూపురంలో అడ్వకేట్ను పోలీసులు కాలుతో తన్నిన ఘటనపై నిరసన వ్యక్తం చేసారు. బాధితుడు న్యాయవాధి అని తెలిసినా దాడి చేసి సీఐ రాజగోపాల్ నాయుడు దూషించాడని ఆరోపించారు. న్యాయవాదులపై పోలీసుల దురాగతాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని బార్ అసోసియేషన్ పేర్కొంది, పోలీసుల తీరుకు నిరసనగా విధులు బహిష్కరణకు బార్ అసోసియేషన్ పిలుపు నిచ్చింది. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకుని రావాలని రెండు రోజుల క్రితం న్యాయవాదులు ధర్నా చేపట్టారు.

## సి.బెలగల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి: సిపిఐ డిమాండ్




సి.బెలగల్, ఆగస్టు 3 కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా, సి.బెలగల్ మండలాన్ని కరువు మండలంగా వెంటనే ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.ఈ మేరకు సోమవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సి.బెలగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉందన్నారు. ముఖ్యంగా సి.బెలగల్ మండలంలో శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో రైతులు పూర్తిగా వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు.ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, ఇప్పటికే వేలాది మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతుల నుంచి పంటల బీమా ప్రీమియం వసూలు చేయడం అన్యాయమని, పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. రైతులపై అదనపు ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం ప్రత్యక్ష సహాయం అందించాలని కోరారు.ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వర్షాలు కురిసిన వెంటనే రైతులు తిరిగి సాగు ప్రారంభించేందుకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు.అదేవిధంగా కరువు ప్రభావంతో పశువులకు మేత కొరత ఏర్పడినందున మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి, ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు కారణంగా ఇబ్బందులు పడుతున్న రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 15 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు నల్లన్న, మండల సహాయ కార్యదర్శులు పకీరప్ప, శేషు, మండల కార్యదర్శి మల్లికార్జున, బాలు, రవి, చిన్న ఈరన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన పేద ప్రజలకు భూములు పంపిణీ చేయాలి
### గిరిజన సమాఖ్య డిమాండ్, వినతి పత్రం సమర్పణ



నరసరావుపేట, :వినుకొండ నియోజకవర్గంలోని గల బొల్లాపల్లి మండలం గండి గనుమల గ్రామ సర్వేనెంబర్ 430 లో ప్రభుత్వ బంజర భూమి ఏ 169.80 సెంట్లు కలదు. కొంతకాలం క్రితం గిరిజన, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేసి అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు సర్వే చేస్తామని రెవిన్యూ అధికారులు ఇంతవరకు చేపట్టడం లేదని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో డిఆర్ఓ అద్దయ్యకు సోమవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు అర్జీలు ఇవ్వడం జరిగింది. నేటి వరకు రెవిన్యూ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆ భూమి కొంతమేరకు గిరిజన ప్రజలు సాగు చేసుకుంటున్నారు. మరి కొంత భూమి బీడుగా ఉంది. నిరుపేదలైన గిరిజన ప్రజలకు భూ పంపిణీ చేస్తే వారి జీవన భృతికి ఉపయోగ పడుతుందన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమగ్ర సర్వే జరిపి, నిరుపేద గిరిజనులకు భూములు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోయ శ్రీన, ఉపాధ్యక్షులు పాలపర్తి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

## బీరపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు.




**సత్తుపల్లి ప్రతినిధి ఆగస్టు 03 ప్రజాబలం:**జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం బీరపల్లి-1, బీరపల్లి-2 అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ (అమ్మమ్మలు, నాయనమ్మలు), గర్భిణులు, బాలింతలు, తల్లుల కోసం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా శిశువుకు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాల్సిన అవసరం, మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే అందించాల్సిన ప్రాముఖ్యత, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాల్సిన అవసరం, అలాగే ఆరు నెలలు పూర్తైన తర్వాత తల్లిపాలతో పాటు పిల్లలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు.బీరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ తల్లిపాల వల్ల శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, తల్లిపాలు పట్టే సరైన విధానం గురించి తల్లులకు అవగాహన కల్పించారు.అనంతరం చిన్నారుల బరువు, ఎత్తును కొలిచి వారి పోషక స్థితిని అంచనా వేసి, తల్లులకు అవసరమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ గంగాజలం, ఏఎన్ఎం మారేశ్వరి, అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మి, చంద్రకళావతి, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్త వెంకటలక్ష్మి దేవి, పాఠశాల ఉపాధ్యాయులు కవిత, సత్య, జమునతో పాటు తల్లులు, అమ్మమ్మలు, నాయనమ్మలు పాల్గొన్నారు.

## బాధితులకు కొండంత అండగా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్

### తిరుమలాయపాలెం మండలంలోని 26 గ్రామాల్లో ఆర్థిక సాయం అందజేత

### మంత్రి పొంగులేటి సూచనలతో 60 కుటుంబాలకు 10 వేల చొప్పున పంపిణీ

తిరుమలాయపాలెం : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు తిరుమలాయపాలెం మండలంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జూలై 1 నుంచి జూలై 31 వరకు వివిధ కారణాలతో మరణించిన మొత్తం 60 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున.. మొత్తం రూ. 6 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.





మండల పరిధిలోని తిరుమలాయపాలెం, బాలాజీనగర్ తండా, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరా తండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రుతండా, మేకలతండా, మేడిదపల్లి, మహ్మదాపురం, ఇస్లావత్‌తండా, రఘునాథపాలెం, కాకరవాయి, జూపెడ, రాజారం, బచ్చోడుతండా, బచ్చోడు, బీరోలు, ఏలువారిగూడెం, దమ్మాయిగూడెం, ఎర్రగడ్డ తండా మొత్తం 26 గ్రామాల్లో బాధితుల ఇళ్లకు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ సహాయాన్ని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రతి నెల క్రమం తప్పకుండా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు ఆర్థిక సాయం అందిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.

## ఆటలో ఆనందం... ఒక్కసారిగా విషాదం

### వీధి కుక్క దాడిలో చిన్నారి తీవ్రంగా గాయాలు.

### విజయవాడకు తరలింపు

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 03:** ఇంటి ముందు అమాయకంగా ఆడుకుంటున్న ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన ఘటన వేంసూరు మండలం భరణిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుల్లపూడి నర్సింహారావు, శివమ్మ దంపతుల కుమార్తె విద్యాభారతి ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా దూసుకొచ్చిన వీధి కుక్క ఆమెపై దాడి చేసింది. ఛాతీ, పొట్ట భాగాల్లో పలుమార్లు కరిచడంతో చిన్నారి తీవ్రంగా గాయపడి రక్తస్రావానికి గురైంది.



చిన్నారి కేకలు విన్న తల్లిదండ్రులు పరుగెత్తుకుంటూ వచ్చి కుక్కను తరిమికొట్టి ఆమెను రక్షించారు. అనంతరం వెంటనే వేంసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం చిన్నారి చికిత్స పొందుతుండగా, సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

వీధి కుక్కల బెడదపై గ్రామస్థుల ఆందోళన

భరణిపాడు గ్రామంలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వీధి కుక్కల నియంత్రణకు స్థానిక అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. “ఒక చిన్నారి చిరునవ్వును భయంగా మార్చిన ఈ ఘటన మళ్లీ ఎక్కడా జరగకూడదు” అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## సరోగసీ సేవలకు చట్టబద్ధ అనుమతులు

### డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా సరోగసీ బోర్డు సమావేశం

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రజాబలం):**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ అధ్యక్షతన సోమవారం జిల్లా సరోగసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఈఏ ప్రోగ్రామ్ అధికారి డా. గీత, గైనకాలజిస్టు డా. మాధవీలత, శిశు వైద్య నిపుణులు డా. శివకుమార్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా సరోగసీ విధానం కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్దేశిత దంపతుల (Intended Couples) దరఖాస్తులను సరోగసీ (నియంత్రణ) చట్టం--2021 మరియు సంబంధిత మార్గదర్శకాల ప్రకారం సమగ్రంగా పరిశీలించారు. దంపతుల అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, వైద్య ప్రమాణాలు తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా అర్హులైన దంపతులకు జిల్లా స్థాయి ధ్రువపత్రాలను జారీ చేశారు.

ఈ ప్రక్రియలో పారదర్శకత, చట్టబద్ధతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, సరోగసీ సేవలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే అమలు కావాలని డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్ తెలిపారు. జిల్లా సరోగసీ బోర్డు ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే అనుమతులు జారీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రతి అర్జీకి పరిష్కారమే లక్ష్యం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 3:**ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి (128) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**ఉప్పల్ ప్రజాబలం ప్రతినిధి** సోమవారంనాడు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సాయిల్స్ కాలనీ సభ్యులు చెర్రీ ఫౌండేషన్లో పండ్లు ప్రధానం చేయడం జరిగింది సాయిల్ కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ జనరల్ సెక్రటరీ పప్పుల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోకాలనీ వాసులు అభిమానులు పాల్గొన్నారు.

## నీలాద్రిలో ఆగస్టు 8న వరుణ యాగం

### దేశ సుభిక్షం, ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు



సతుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 03:పెనుబల్లి మండలంలోని నీలాద్రి శ్రీ నీలాద్రిశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 8వ తేదీ (శనివారం) వరుణ యాగం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీ కుమారి తెలిపారు. దేశంలో అతివృష్టి, అనావృష్టి లేకుండా సకాలంలో వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సంకల్పంతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, వరుణ జపం, మండపారాధన, ఋష్యశృంగ ఆవాహన, వరుణ ఆవాహన, అష్టోత్తర శతఘట కలశ స్థాపన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మహాపూర్ణాహుతి జరగనుంది.

ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందాలని ఈఓ కోరారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఉదయం 8 గంటలకు సత్తుపల్లి నుంచి లంకపల్లి--నీలాద్రి మీదుగా కొత్తగూడెం వెళ్లే ప్రత్యేక బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# రాళ్ల బండి అంజమ్మ కువిశ్వబ్రాహ్మణులఘన నివాళి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 3 :విశ్వబ్రాహ్మణ జాతిరత్నం పురోహిత రత్నం రాళ్ల బండి లంకేశ్వర చారి మాతృమూర్తి కీర్తిశేషులు రాళ్ల బండి అంజమ్మ కు దశదినకర్మ కు బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశా చారి హాజరై మాతృమూర్తికి ఘనంగా నివాళులు అర్పించారు. రాళ్ల బండి లంకేశ్వర చారి పంతులు విశ్వబ్రాహ్మణ జాతిలో ఆదర్శ పురోహిత రత్నం లాంటి వారి తల్లి మరణం జాతికి తీరని లోటని ఆ తల్లి ఆత్మకు శాంతి చేకూర్చాలని కుందారం గణేష్ చారి వలబోజు నరసింహ చారి నివాళులు అర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో లంకేశ్వరాచారి మల్లేశ్వర చారి భార్గవాచారి వాళ్ళ బాలా చారి విఠోబా జ్యోతి విజయలక్ష్మి మరియాలా వాస్తవ్యులు పులి మామిడి, బాల బ్రహ్మచారి రామ బ్రహ్మచారి భగవంతు చారి కలకొండ బిక్షపతి మహంకాళి నరసింహ చారి,

# ఏబీవీపీ బషీర్బాగ్ నగర కార్యదర్శిగా మరోసారి నియమితులైన సురేందర్..



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 3 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐత నిఖిల్ జీ హాజరై, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో చదువుతున్న విద్యార్థి నాయకుడు సురేందర్‌ను బషీర్బాగ్ నగర కార్యదర్శిగా వరుసగా రెండోసారి నియమించారు.

ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ, తనపై మరోసారి విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏబీవీపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమస్ఫూర్తితో పనిచేస్తానని, విద్యార్థుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

బషీర్బాగ్ నగర శాఖను తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నగర శాఖగా తీర్చిదిద్దే దిశగా పనిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు అండగా నిలిచి, సంస్థ ఆశయాలను ముందుకు

# కేంద్ర విధానాలతో పౌర స్వేచ్ఛ కు విఘాతం

## సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ అధికార ప్రతినిధి నకిరేకంటి చిట్టిబాబు



రాజమండ్రి ఆగస్ట్ 3; సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ పార్టీ ముఖ్యుల సమావేశం జైరాం అధ్యక్షతన కాటవరం లో జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో అమలవుతున్న ప్రభుత్వ విధానాలవల్ల పౌర స్వేచ్ఛ దెబ్బ తింటుదని,ప్రశ్నించే వారిని దేశ ద్రోహులు,అర్బన్ నక్సలైట్ అని ముద్ర వేయడం ప్రజాస్వామ్యనికి మంచిది కాదని ,ప్రతి నిరసన జంతర్ మంతర్ లా మారినప్పుడే ప్రజాస్వామ్యం,పౌర హక్కులు నిలబడుతాయని అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ మాట్లాడుతూ బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజల ప్రభుత్వ రంగ సంస్థల ను అమ్మెవేయడం జరిగిందని, సహజ వనరులు,అడివి,సముద్ర ఓడరేవులు అదానీ, అంబానీ చేతిలో పెట్టిన మోదీ. ప్రజల హక్కును తుంగలో తొక్కారని ,రాజంగం కల్పించిన ప్రాథమిక సౌకర్యాలు కుడు,గూడు,విద్య,వైద్యం, ఉపాధి అవకాశాలు లేకుండా ,ప్రజలను కాందిశీకులగా మార్చి వేశారని మండి పడ్డారు, ఈ దళారీ, దోపిడి పాలక వర్గాల కు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమ లకు సన్నద్ధం కావాలని పిలుపు ఇచ్చిన

సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటు కార్యదర్శి గా బి జయరాం,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, పార్టీ కార్యవర్గ సభ్యులుగా బత్తుల అప్పలరాజు, పల్లే సురేష్, సత్యవతి, భీమ్ రెడ్, చంద్ర శేఖర్,ఎం రమణ,సత్తిబాబు లను రాష్ట్ర కమిటీ సభ్యులు గా ఎన్నుకోవడం జరిగింది.

# ముందస్తు పారిశుధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలి




**సిద్దిపేట ప్రజాబలం ప్రతనిధి:** సిద్దిపేట సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో ఐదు డెంగ్యూ వ్యాధులు నమోదయ్యాయని వాటి సంఖ్య పెరగకుండా వాటిని నిరోధించేందుకు అన్ని గ్రామాలు మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రెండు రోజులు కచ్చితంగా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి వర్షం నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. పంచాయతీ శాఖ సహకారంతో ఈనెల 4వ తేదీ మంగళవారం రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి నిలువ నీరు లేకుండా చూసుకోవాలని చెత్తాచెదారం తొలగించాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి నమోదైన జిల్లాలోని గ్రామాలలో వెంటనే డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించి, ప్రత్యేక పరిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించి యదాతధంగా స్కీమును కొనసాగించాలి

## రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నేతృత్వం లోహయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ముట్టడి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 3;విద్యార్థులఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించి యదాతధంగా స్కీమును కొనసాగించాలని డిమాం చేస్తూ రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నేతృత్వం లో బిసి సంఘాలు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ను ముట్టడించారు.

ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ మాట్లాడుతూ 14 లక్షల మంది కాలేజి విద్యార్థుల ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించక పోవడంతో విద్యార్థుల కష్టాలు చెప్పతరం కాదు, కోర్సు పూర్తి అయిన వారికి సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. కోర్సు పూర్తి అయిన వారికి సర్టిఫికేట్లు ఇవ్వాలని కోర్టులు తీర్పు చెప్పుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫీజు కట్టి వరకు అడ్మిషన్లు ఇవ్వడం లేదు. కాలేజీలకు రానివ్వడం లేదు.

ఫీజుల బకాయిలు చెల్లించాలని విద్యార్థుల వద్ద ఫీజులు వాసులు చేయరాదని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్శిసిటీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నిఖిల్ పటేల్ మాట్లాడుతూ

ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు.

ఈ ఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడు సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన వారికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. చదువుతున్న వారి ఫీజులు కట్టి వరకు కాలేజీలకు రానివ్వడంలేదు. పీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారు. ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్రే కాకుండా 23 వేల ప్రభుత్వ పాఠశాలను రద్దు చేస్తామని బహిరంగంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే ఎంతో ఉన్నత విద్య ప్రమాణాలతో బలహీన వర్గాల జీవితాల మార్పు. అభివృద్ధి చేస్తున్న గురుకులాలను కులాల పేరు మీద ఎందుకంటా రద్దు చేసి కుట్రకు తెర తీస్తున్నారని విమర్శించారు.

రాజేందర్ ముదిరాజ్, ఆశిష్ గౌడ్,లింగయ్య యాదవ్, భీమ్ రాజ్,భారీ అశోక్,సిద్దు యాదవ్,నరేష్ గౌడ్,, వంశీ పటేల్,కిరణ్, చిల్లర యశ్వంత్,గోపి, బలరాం, తదితరులు

# ప్రజావాణికి 102 ఫిర్యాదులు

**ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి -- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**- ప్రజావాణిలో మొత్తం 102 ఫిర్యాదుల స్వీకరణ**

**- రెవెన్యూ శాఖకు 33, ఇతర శాఖలకు 69 వినతులు**


**- అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

**- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**

**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 102 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా





వ్యవహరించాలని తెలిపారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన 33, ఇతర శాఖలకు చెందిన 69, మొత్తం 102 దరఖాస్తులు అందాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వికారాబాద్ వెంచర్లలోని ప్లాట్లను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

వికారాబాద్ జిల్లాలోని పలు వెంచర్లలో ఉన్న ప్లాట్లను నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు.మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో వికారాబాద్కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ని కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.వికారాబాద్ పరిధిలోని పలు వెంచర్లలో సాధారణ ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్లు గత కొంతకాలంగా నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. "వెంటనే ఈ ప్లాట్లను నిషేధిత జాబితా నుండి తొలగించి, రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు వేలాది మంది సామాన్యుల సమస్యలు పరిష్కారమవుతాయి" అని వారు విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ దీపక్ తివారి, అధికారులతో చర్చించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే ప్రధానం...

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/శిశు వు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత విలువైన తొలి ఆహారమని,పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు,ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించే పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఆయన ఆవిష్కరించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను శిశువు కు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అవి శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని అన్నారు,తల్లి-శిశువు మధ్య బంధం మరింత బలపడుతుందని అన్నారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత,పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి,ఆర్డీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత.

## పట్లూరు మాజి సర్పంచ్ ఇందిర అశోక్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ గృహాన్ని సందర్శించిన శ్రీ శ్రీ 108 విశ్వ గురుదత్త గురిజి న్యాంతాబాద్ అప్ప గారు.కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో అధ్యాత్మిక చింతన కార్యక్రమం లు నిర్వయిస్తూ భక్తుల కష్ట సుకాలల్లో పాలుపంచుకుంటూ అందరికి అండదండలుగా ఉంటున్న ఉంటున్న న్యాంతాబాద్ అప్పగారు. పట్లూరు మాజి సర్పంచ్ ఇందిర అశోక్ మాట్లాడుతూ ఈ రోజు ఉదయం మా గ్రామ దేవాలయాల కమిటీ చైర్మన్ శ్రీ సిరిపురం శ్రీశైలం గారి ఆహ్వానం మేరకు పట్లూరు గ్రామానికి వచ్చిన న్యాంతాబాద్ గురిజి గారికి సాధారణంగా ఆహ్వానం పలికి వారికీ పాద పూజ నిర్వయించి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని గురువులను నమ్ముకుంటే మానసిక ప్రశాంత కలుగుతుందని మనకు ఎదురు అవుతున్న కష్టాలు తొలుగుతాయి అని అందరం కూడ దైవ చింతన అలవర్చుకోవాలని కోరారు. అదేవిదంగా పట్లూరు గ్రామంలో ఆషాడ మాస పూజ కార్యక్రమం లు అన్ని దేవాలయాలలో పూజ లు భజనలు,నిర్విస్తూ ప్రతేకంగా హనుమాన్ దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిత్యం పటిస్తూ పట్లూరు గ్రామశీ ఆధ్యాత్మిక నిలయకేంద్రంగా విరాజిల్లితుందని కొనియాడారు. పట్లూరు గ్రామ ప్రజలు భిన్నత్వంలో ఎక్కత్వాంగా ఉంటూ ఒకరిని ఒకరు గౌవరివిస్తూ సంతోషంగా జీవిస్తున్నామని సంతోషం వ్యక్తం చేసారు. పురాతన ఆలయాలు పునః నిర్మించుకొని మా గ్రామం అభివృద్ధిలో ముందుందని, అలాగే చర్చిలు, మసీదులల్లో నిత్యం దైవ ప్రార్థనలు జరుగుతాయి అని తద్వారా అందరం సోదరిభావం తో మా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామని పట్లూర్ మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్ తెలిపారు.

## మర్పల్లి నేడే సర్వసభ సమావేశంలో పాల్గొంటున్న

## ముఖ్య అతిథి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల సర్వసభ సమావేశానికి మన ప్రియతమ నాయకులు వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ విచ్చేస్తున్నాడు అని మన మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు,మంగళ వారం మధ్యాహ్నం 02:30 గంటలకు మర్పల్లి మండల కేంద్రంలో నీ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న జనరల్ బాడీ సమావేశానికి మన ప్రియతమ నాయకులు, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ విచ్చేయనున్నారు.

కావున కాంగ్రెస్ పార్టీ మర్పల్లి మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు . తప్పనిసరిగా సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు

## భవానీ మందిర్, హనుమాన్ మందిర్ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్



**జహీరాబాద్, ఆగస్టు 3 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని భవానీ మందిర్ రోడ్, హనుమాన్ మందిర్ రోడ్ విస్తరణ పనులను మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయించారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సమావేశానికి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు 27, 30, 31 వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. భవానీ మందిర్ రోడ్, హనుమాన్ మందిర్ రోడ్‌ల విస్తరణకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, మాస్టర్ ప్లాన్‌లో ఆమోదించబడిన 40 అడుగుల వెడల్పు రహదారి ప్రకారం రోడ్డు విస్తరణ పనులను కొనసాగించాలని నిర్ణయించారు. నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే పనులు కొనసాగించేందుకు సంబంధిత వార్డుల కౌన్సిలర్లు తమ అంగీకారం తెలిపినట్లు కమిషనర్ ప్రభాకర్ వెల్లడించారు.

## మాట ఇచ్చా... నెరవేర్చుకుంటూ పోతా....

### అభివృద్ధి.....సంక్షేమం నా ఎజెండా....

### అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ

**చంద్రుగొండ/ దమ్మపేట ఆగస్టు మూడు ప్రజాబలం ప్రతినిధి :-** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మందలపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రూ. 57 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక నాయకులతో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను





ఆదేశించారు.

అదేవిధంగా గ్రామీణ ప్రాంత మహిళలకు రవాణా భారం తగ్గించేందుకు ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారి హక్కులు మరియు శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.




అనంతరం దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి పరిపాలనా పరమైన అంశాలపై ట్రైనీ కలెక్టరు(తహశీల్దార్)తో వివరంగా చర్చించారు. రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు,ఆత్మ కమిటీ చైర్మన్ ,తహశీల్దార్ ,జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీనాయకులు,డిపో మేనేజర్ గారు,ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

## చెత్త పేరుకుపోవడంతో స్థానికుల ఆందోళన



**జహీరాబాద్, ఆగస్ట్ 3 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు 31 నాల్ సాబ్ మొహల్లా కాలనీలో ఇంటి ముందు చెత్త పేరుకుపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కాలనీలోని కొందరు వ్యక్తులు ఇంటి సమీపంలోనే చెత్తను పారవేయడంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెత్తను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భవిష్యత్తులో అక్కడ చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే స్థానికులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పబ్లిక్ వాటర్ ట్యాప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఆందోళన చేపడతామని హెచ్చరించారు.వినతి పత్రం సమర్పించిన వారిలో సోమ అనిల్. కౌలాస్ మహదేవ్, శంకర్,రవి .శ్రీకాంత్, అజయ్,ఫైయాజ్, సాయి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## "పూజిత" వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం



నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలో గల పూజిత ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. రసవత్తరంగా జరిగిన ఈ ఎన్నికలలో నువ్వా నేనా అన్న చందంలో అధ్యక్ష పదవికి పోటీ జరిగింది. ఈ కాలనీ లో సుమారు 850 కుటుంబాలు నివాసం ఉన్నారు. ఎన్నికల నిర్వహణ మాజీ అధ్యక్షుడు శరత్ ,మాధవి మేడమ్ మరియు5 గురు కమిటీ వారు చక్కగా నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా అనంతుల విద్యాసాగర్ , ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రావు ,సహాయ కోశాధికారిగా నాగార్జున కంభం(సిలికాన్ టవర్స్),ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి పట్లూరి.బొడ్డు నాగరాజ,శాయ కార్యదర్శులుగా హరిబాబు కాటేపల్లి, వేగుళ్ల మరి అశ్వని జ్యోతి,కోశాధికారిగా ఎల్ కే నాయుడు,పీఆర్ఓ గా ఎం. నర్సింహా రెడ్డి ఎన్నికయ్యారు. కాలనీ వాసులు నా పైన నమ్మకంతో గెలిపించి నందుకు విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి...

## అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం :జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను




జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు,సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు,వేదిక,అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ,భద్రత,తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు,జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారి కి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు,జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు,ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత,పాండు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లు,రెవెన్యూ డివిజనల్ అధికారులు,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా విజయ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం నషా ముక్త్ యువ



కార్వాన్ : దేశవ్యాప్త విజయ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం నషా ముక్త్ యువలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన 'మై భారత్' సంస్థ ఆధ్వర్యంలో భారత గౌరవ ప్రధానమంత్రి గారి ప్రత్యక్ష వర్చువల్ ప్రసంగం హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌ఎన్‌ఐఎస్‌టి)లో ప్రసారం చేయబడింది. దేశవ్యాప్తంగా 10,000కు పైగా ప్రదేశాలను అనుసంధానిస్తూ ప్రధానమంత్రి ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. తన ప్రసంగంలో యువత మాదకద్రవ్యాలకు, ఇతర వ్యసనాలకు




దూరంగా ఉండాలని ఆయన కోరారు. 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని వారికి పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన, వ్యసన రహిత సమాజం కోసం ప్రతి పౌరుడి సమిష్టి నిబద్ధతతో విజయ భారత్‌ను సాధించవచ్చని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మరియు యువ ప్రతినిధులు నషా ముక్తి ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి ఇతరులను ప్రేరేపిస్తామని వారు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఎన్‌ఐఎస్‌టి విద్యార్థి వ్యవహారాల డీన్ శ్రీ పురుషోత్తం హాజరయ్యారు. పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ శ్రీ విజయ భాస్కర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీమతి ప్రీతి జీవన్, మరియు జిల్లా ఇన్ఫర్మేటిక్స్ ఆఫీసర్ శ్రీ మధుసూదన్, వీరితో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మరియు యువ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత యొక్క ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని అభినందిస్తూ, నశ ముక్త భారత్ మరియు వికసిత భారత్ అనే దార్శనికతకు మై భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించిన మై భారత్ హైదరాబాద్, జిల్లా యువజన అధికారి శ్రీ శశాంక్ రావుల వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# ట్రైబల్ లా కాలేజీపై మంత్రి దామోదర రాజనర్సింహ కు కృతజ్ఞతలు

## రూ.35.50 కోట్లతో చౌటకూర్‌లో మంజూరు

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా : చౌటకూర్,



మండల కేంద్రంలో రూ.35.50 కోట్ల వ్యయంతో ట్రైబల్ లా కాలేజీ, మంజూరు చేసిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహకు, గిరిజన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లంబాడాల పోరాట సమితి నాయకులు ప్రకాష్ రాథోడ్, మహేష్ రాథోడ్, మెగరాజ్ నాయక్, తదితరులు సంగారెడ్డిలో మంత్రిని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మిఠాయి తినిపించి తమ ఆనందాన్నిపంచుకున్నారు చౌటకూర్,లో ట్రైబల్ లా కాలేజీ ఏర్పాటు



చేయడం ద్వారా గిరిజన విద్యార్థులకు న్యాయ విద్య మరింత చేరువవుతుందని నాయకులు పేర్కొన్నారు. ఉన్నత విద్యతో పాటు న్యాయ రంగంలో గిరిజన యువత రాణించేందుకు ఈ కళాశాల దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.దిశా కమిటీ సంగారెడ్డి జిల్లా సభ్యుడు ప్రకాష్ రాథోడ్, మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన న్యాయ విద్యను అందించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంచారిత్రాత్మకమన్నారు. కళాశాల మంజూరుకు మంత్రి దామోదరరాజనర్సింహ,కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎస్సీ--ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్, ఆందోల్ నియోజకవర్గ నాయకుడు మహేష్ రాథోడ్,మేఘరాజ్ నాయక్,ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, సర్పంచ్‌లు వినోద్, జైపాల్, సేనాపతి అశోక్, గోపాల్, రాజు, గణేష్ నాయక్, విద్యార్థులు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ప్రజావాణిలో 48 వినతులు స్వీకరణ...



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని



సూచించారు,సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు,అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు,నేటి ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు,వీటిలో కలెక్టరేట్‌లో 48,సంగారెడ్డి డివిజన్‌లో 8,జహీరాబాద్ డివిజన్‌లో 7,నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు అందగా,అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని పేర్కొన్నారు,అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, ఈఈ (పంచాయతీరాజ్), పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి , కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించినవని తెలిపారు,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/ఆషాఢ మాసం సందర్భంగా కంది మండలం బేగంపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉమా సాయిగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు,ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ మహిళలు, యువకులు, ఎమ్మెల్యేతో సెల్ఫీలు,ఫోటోలు దిగుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు,పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల నృత్యాలు,డప్పు చప్పుళ్ల నడుమ సంప్రదాయబద్ధంగా బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. ఈ ఉత్సవాలకు బేగంపేట గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు,బోనాల పండుగను ఘనంగా నిర్వహించే గ్రామం బేగంపేట అని ఎమ్మెల్యే పేర్కొన్నారు,అమ్మవారి కృపతో ప్రజలు అందరూ చల్లగా ఉండాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, చింత సాయినాథ్, మాజీ జెడ్పీటీసీ మనోహర్ గౌడ్, కృష్ణ గౌడ్, మోహన్ రెడ్డి, శంకర్ గౌడ్, రాజేందర్ నాయక్, మహిళలు, యువకులు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 15న తిరంగా ర్యాలీ

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అఖండ భారత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 న తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ర్యాలీకి సంబంధించిన పోస్టర్ ను బిజెపి నాయకురాలు కీర్తి రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు సెంథిల్ కుమార్, బిందు లు ఆవిష్కరించారు. యువతలో జాతీయ భవాని పెంపొందించేందుకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల మీదుగా రాలి కొనసాగి కరీంనగర్ లో ముగుస్తుందని చెప్పారు. కులమతాలకు అతీతంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

## తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్

**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైద్రాబాద్ లో తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళన చేపట్టారు... హైద్రాబాద్,నాంపల్లి,గృహకల్ప లో తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు ఐతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉద్యోగులను విస్మరిస్తుందని ఆరోపించారు.కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు అమలు చేస్తాలేరని ప్రశ్నించారు. ప్రభుత్వం మొండివైఖరిని నిరాశిస్తూ.. ఆగస్ట్ 23న హైద్రాబాద్ లో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని,ప్రభుత్వం పై తమ పోరాటం తీవ్రతరం చేస్తామని నరేందర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో కె ఝశ్రీశ్రీవంప్త్ర, అర్ శివ కుమార్ నాయక్ మరియు కోఆపరేటివ్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.




# ప్రతిపాదిత ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీల పై సమీక్ష సమావేశం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి లోని తన నివాసంలో, అందోల్ నియోజకవర్గం లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, నూతనంగా నిర్మించనున్న ప్రతిపాదిత ప్రభుత్వ కార్యాలయాలఏర్పాటుకు,అవసరమైన స్థల పరిశీలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈసమీక్ష సమావేశంలో నూతనంగానిర్మించనున్న,లాకాలేజీ, తహసిల్దార్,పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, పిహెచ్సిసీ,ల ప్రతిపాదిత భవనాలకు, స్థల సేకరణ పరిశీలనపై రెవెన్యూ అధికారులతో,మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, వివరాలు అడిగి తెలుసుకున్నారు, అలాగే నియోజకవర్గంలో చేపట్టిన, అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు, భూభారతి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయడంపై, అదనపు కలెక్టర్ (ఎల్బీ ) పాండు,, (డీఎంహెచ్వో ) డా. లలితా దేవి, సంగారెడ్డి,అందోల్,రాజేందర్, రమేష్ కుమార్,అందోల్ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్ తో మంత్రి చర్చించారు, సంగారెడ్డి జిల్లాలో ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆసుపత్రులలో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ, అన్ని ఆసుపత్రిలో అవసరమైన మందులను, అందుబాటులో ఉంచుకోవాలని, మంత్రి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు, జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, నిరంతరం అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మంత్రీ శ్రీ దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు....

## మానవత్వం చాటుకున్న భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధూ రావణ్



**జహీరాబాద్, ఆగస్టు 3 ప్రజాబలం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్ధూ రావణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. జహీరాబాద్ జాతీయ రహదారిపై ఆకలితో, చిరిగిన దుస్తులతో నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ అనాథ యువకుడిని గమనించి వెంటనే సహాయం అందించారు. యువకుడికి భోజనం, తాగునీరు అందించి, కొత్త దుస్తులు కొనుగోలు చేసి ఇచ్చారు. అనంతరం అతడిని సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనను చూసిన స్థానికులు, ప్రయాణికులు సిద్ధూ రావణ్ సేవాభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సిద్ధూ రావణ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడమే నిజమైన మానవత్వమని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

## సామాజిక సమరసత--యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**జహీరాబాద్, ఆగస్టు 3 ప్రజాబలం ప్రతినిధి :** విద్యార్థులకు విద్యాభ్యాసంలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో సామాజిక సమరసత ఆధ్వర్యంలో, యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో సోమవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన 200 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ, విద్య ప్రతి చిన్నారి జన్మహక్కు అని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు ఏ విద్యార్థి భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన యువత ముందుకు వచ్చి విద్యార్థుల అభివృద్ధికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని అన్నారు.



పూజ్య శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ, సేవాభావంతో చేపట్టే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. అవసరమైన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత మెదక్ విభాగ కన్వీనర్ అరిగే చంద్రమౌళి, సంగన్న, పట్లోళ్ల గోపాల్, నరసింహారెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యూత్ ఫర్ సేవా సభ్యులు, సామాజిక సమరసత ప్రతినిధులు, దాతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. విద్యార్థులు నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగులను ఆనందంగా స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు యూత్ ఫర్ సేవా, సామాజిక సమరసత ప్రతినిధులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి మరింత మంది విద్యార్థులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

## వట్టిపల్లి స్టేషన్ పై దాడి స్టేషన్లో అద్దాలు ఫర్నిచర్, ధ్వంసం ధ్వంసం చేసిన దరఖాస్తు పల్లి గ్రామస్తులు




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 03 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** వట్టిపల్లి పరిధిలోని దాబాలో పనిచేసే, బీరప్ప (22) చెట్టుకు ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి, మృతుని కుటుంబీకులకు సమాచారం ఇవ్వకుండా, చెట్టుపైనుండి మృతదేహాన్ని కిందకు దించిన పోలీసులు, ఈ విషయం తెలుసుకున్న దరఖాస్తు పల్లి గ్రామస్తులు, చెట్టు పైనుండి మృతదేహాన్ని కుటుంబీకులకు సమాచారం ఇవ్వకుండా ఎలా కిందకు దించుతారని, పోలీసులపై దాబా ఓనర్లపై, దరఖాస్తు పల్లి గ్రామస్తులు ఆగ్రహం, పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని, పోలీసులతో వాగ్వివాదం, పోలీస్ స్టేషన్ పై దాడి, స్టేషన్లో ఉన్న అద్దాలు ఫర్నిచర్ ధ్వంసం, పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత.....




# జూదం ఆడుతున్న 9 మంది పట్టివేత



**జహీరాబాద్, ఆగస్టు 3 ప్రజాబలం ప్రతినిధి:** మొగుడంపల్లి మండలం జడిమల్కాపూర్ గ్రామంలోని లక్ష్మమ్మ దేవాలయం వెనుక భాగంలో పేకాట ఆడుతున్న 9 మందిని జహీరాబాద్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో రూ.5,160 నగదు, 7 మొబైల్ ఫోన్లు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ జూద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది... డీసీసి అధ్యక్షులు నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ ప్రారంభించారు,వార్డు కౌన్సిలర్ సుష్మితా ప్రశాంత్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డీసీసి అధ్యక్షులు నిర్మలా జగ్గారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్,కౌన్సిలర్ లు శైలేష్ రెడ్డి,నవాజ్ వీణకిరణ్ కాంగ్రెస్ నాయకులు రాజంపేట శ్రీనివాస్, కసిని రాజు, మోహన్, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు అరిఫ్,ఎస్ సి సెల్ నాయకులు చిన్న,మనోజ్ ఇంతియాజ్ మూజీబ్ తదితరులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం, ఒకరు మృతి,మరొకరి పరిస్థితి విషమం

తిరుపతి నాయుడుపేట పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ మండలం,ఓటేరు సమీపంలోని సెవెన్ హిల్స్ హోటల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న కట్టెల లోడు లారీ ని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. మృతుడు అగ్రహారం పంచాయతీ వినాయక నగర్ చెందిన సురేష్ (26) గా గుర్తించారు. అదే గ్రామానికి చెందిన వంశీ ఆచారి తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై బాధితుల ఫిర్యాదుతో తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com